# ప్రజాశక్తి

సోమవారం 18 ఆగస్టు 2025 8 పేజీలు

గుంటూరు పల్నాడు


# రాజధాని పనులకు ఆటంకం



నీరుకొండ వద్ద కొండవీటి వాగు ఉధృతి

- అమరావతిని వెంటాడుతున్న ముంపు
- వాగుల నియంత్రణపై కొరవడిన దూరదృష్టి
- పదేళ్లుగా దక్కని పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

వర్షాలతో రాజధానిలో అభివృద్ధి పనులకు ఆటంకాలు ఏర్పడుతున్నాయి. వారం రోజులుగా వర్షాల వల్ల పనులు ముందుకు సాగడం లేదు. ప్రధానంగా వాగుల వల్ల గ్రామాల్లో ముంపు సమస్య వెంటాడుతోంది. చిన్న పాటి వర్షాలతో కొన్ని వాగులు, భారీ వర్షాల వల్ల మరికొన్ని వాగులు పొంగి ప్రవహించి రాజధాని ప్రాంతాన్ని ముంచెత్తుతున్నాయి. దీని వల్ల రాజధానిలో అభివృద్ధి పనులు వేగం పుంజుకోవడం లేదు. లాం దగ్గర నుండి వచ్చే కొండవీటివాగు, మోతడక, నిడుముక్కల నుంచి కొట్టేళ్ల వాగు, వైకుంఠపురం వద్ద పాలవాగు, మందడంలో నుండి సారవాగు రాజధాని గ్రామాలను ముంపునకు గురిచేస్తున్నాయి.

2014లో రాజధానిగా అమరావతి ప్రకటించినప్పటి నుంచి భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి, కృష్ణానదికి వరదలు వచ్చినప్పుడు అనివార్యంగా రాజధాని గ్రామాలకు ముంపు బెడదతప్పడం లేదు. రాజధాని గ్రామాల్లో ముంపు సమస్యను ఇటీవల ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం కూడా సిఆర్‌డిఎ అధికారులను నిలదీసింది. శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని సూచించింది. రాజధానికి అతి పెద్ద వాగుగా ఉన్న కొండవీటి వాగు ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కనుగొనలేకపోయారు. 2018లో రూ.224.44 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించారు. అయినా కొండవీటి వాగు నీటిని నియంత్రించలేకపోతున్నారు. పెదపరిమి వద్ద కోటేళ్ల వాగుతో ప్రతిసారీ రాకపోకలకు అంతరాయం కలుగుతున్నా నివారణ చర్యలు లేవు. మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల్లోని కొండల నుంచి వచ్చే కొండవీటి వాగు ముంపుపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వలేదు. మోతడక, అనంతవరం, నెక్కల్లు పరిసరాల్లో నుండి తుళ్లూరు, పెదపరిమి మధ్యలో నుండి నీరుకొండ, శాఖమూరు గ్రామాలను కొటేళ్లవాగు ముంచెత్తుతోంది. వైకుంఠపురం నుండి దొండపాడు, రాయపూడి, మందడం, వెంకటపాలెం మీదుగా పాలవాగు వస్తోంది. వెలగపూడి, మందడం, వెంకటపాలెం గ్రామాలను సారవాగు ముంచెత్తుతోంది. ఈ వాగులు సహజంగా వచ్చే నీటితో పరిసరాల్లో కురిసే అతి భారీ వర్షాలతో కలిసే ఐదారు వేల క్యూసెక్కుల

2లో

ప్రచారంలో మాట్లాడుతున్న కౌలురైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కె.రామరావు

# కౌలురైతుల సమస్యలపై 25న ధర్నా

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

కౌలురైతులందరికీ గుర్తింపు కార్డు మంజూరుతోపాటు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రూ.2 లక్షల వరకు హామీ లేని పంట రుణాలివ్వాలని ఎపి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్ వద్ద 25న ధర్నాకు కౌల్దార్లు అధిక సంఖ్యతో తరలిరావాలని పిలుపునిచ్చారు. నరసరావుపేట మండలం కేసానుపల్లి, చిన్నతురకపాలెం, చింతలపాలెం, గోనెపూడి, గురవాయిపాలెం, కొండకావురు, అచ్చమ్మపాలెం, పెట్లూరి వారిపాలెం, అర్వపల్లి, ఉప్పలపాడు, లింగంగుంట్ల, ఇక్కుర్రు, అల్లూరివారిపాలెం, పాలపాడు, రావిపాడు తదితర గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రచారంలో రాధాకృష్ణ మాట్లాడారు. కౌల్దార్ల గుర్తింపు, కార్డుల జారీ ఆశించిన రీతిలో లేదన్నారు. పల్నాడు జిల్లాలో 7.50 లక్షల ఏకరాలు సాగవుతుండగా సాగుదారుల్లో 60-65 శాతం మంది కౌల్దార్లేనని, వీరి సంఖ్య 1.50 లక్షలుంటుందని చెప్పారు. అయితే 65 వేల మందికే గుర్తింపు కార్డులివ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, ఆ మేరకూ మంజూరు చేయలేదని విమర్శించారు. దీంతో పెట్టుబడి సాయం, రాయితీలు, పంట రుణాలు కౌల్దార్లకు అందడం లేదని అన్నారు. ప్రైవేటు అప్పులతో పెట్టుబడి సమకూర్చుకుని, కుటుంబం మొత్తం కష్టపడి పండించిన పంటకు మద్దతు ధర దక్కడం లేదని, కొన్ని సందర్భాల్లో ప్రకృతి వైపరీత్యాలకు పంట దెబ్బతిని అప్పులపాలై, ఆత్మహత్యలూ చేసుకుంటున్నారని ఆవేదన వెలిబుచ్చారు. గుర్తింపు కార్డులు మంజూరులో భూ యజమాని సంతకం తప్పనిసరి నిబంధనను తొలగించాలని డిమాండ్ చేశారు. ఇందుకు భూ

2లో

వెన్నపూస కాలనీలో రేకుల షెడ్డులో నిర్వహిస్తున్న ఎస్సీ బాలుర హాస్టల్

# రేకుల షెడ్డుల్లో హాస్టళ్లు!

- సదుపాయాల లేమి, సమస్యలతో సతమతం
- చదువుపై కేంద్రీకరించలేక విద్యార్థుల అవస్థ

ప్రజాశక్తి - వినుకొండ

వెనుకబడిన సామాజిక తరగతులకు చెందిన విద్యార్థులకు వసతి కల్పించేందుకు ఏర్పాటు చేసిన హాస్టళ్లు అధ్వానంగా తయారయ్యాయి. సదుపాయాలు కూడిన శాశ్వత భవనాలు నిర్మించకుండా అద్దె భవనాల్లోనే వీటిని ప్రభుత్వం నెట్టుకొస్తుంది. ఇరుకు గదులు, రేకుల షెడ్లలో ఉండలేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. హాస్టల్లో నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో మరిన్ని సమస్యలొస్తున్నాయి.

వినుకొండ పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులోని ఎస్సీ బాలుర హాస్టల్ శిథిలావస్థకు చేరుకొని పై కప్పు పెచ్చులూడుతోంది. వానొస్తే భవనం నుండి నీరు కారుతోంది. ఈ పరిస్థితుల్లో హాస్టల్‌ను ప్రస్తుతం వెన్నపూస కాలనీలోని ఒక అద్దె రేకుల షెడ్డులోకి మార్చారు. సుమారు వందమందికి పైగా విద్యార్థులున్న ఈ హాస్టల్‌ను గోడౌన్లకు ఉపయోగించే రేకులు షెడ్లలో నిర్వహిస్తుండడం, సరైన వసతులు లేకపోవడంతో విద్యార్థులు పరిస్థిత వర్ణనాతీతంగా ఉంది. మండల కేంద్రమైన బొల్లాపల్లిలోని బీసీ

2లో

ప్రకాశం బ్యారేజీ నుండి దిగువన సముద్రంలోకి విడుదలవుతున్న నీరు

# ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి- తాడేపల్లి

నాగార్జునసాగర్ నుండి ప్రకాశం బ్యారేజీకి భారీ నీరొస్తున్న నేపథ్యంలో అధికారులు ఆదివారం మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీకున్న 70 గేట్లు ఎత్తి సముద్రంలోకి నీరు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 2.84 లక్షల క్యూసెక్కుల వరద నీరు పై నుండి వస్తుండగా అంతే స్థాయిలో దిగువకు వదులుతున్నారు. రాత్రికి 3.97 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. మత్స్యకారులను చేపల వేటకు వెళ్లొద్దని, నదీ పరివాహక ప్రాంతంలోని ప్రజలు

2లో

## విద్యుత్ భారాలను నిరసిస్తూ 28న ప్రతిజ్ఞ

5లో

# స్వాతంత్ర్యోద్యమ ఐక్యతను కొనసాగించాలి

## ప్రముఖ చరిత్రకారులు నసీర్ అహ్మద్

ప్రజాశక్తి-గుంటూరు

మాట్లాడుతున్న నసీర్ అహ్మద్

కుల మతాలకు అతీతంగా స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడిన దేశ ప్రజల త్యాగచరితను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ప్రముఖ చరిత్రకారులు, కళారత్న అవార్డు గ్రహీత నసీర్ అహ్మద్ అన్నారు. స్వాతంత్ర్యోద్యమం- నాటి త్యాగాలు-నేటి కర్తవ్యాలు' అనే అంశంపై ఆవాజ్ ఆధ్వర్యంలో

2లో

# దొంగ ఓట్లు... దొంగ నోట్ల రాజ్యం

- దేశమంతా చర్చిస్తున్నా ఏపీలో మౌనం ఎందుకు
- సిపిఐ జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

8లో

## ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

(మొదటి పేజీ తరువాయి)

అప్రమత్తంగా ఉండాలని కోరారు. రెవెన్యూ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని తాడేపల్లి తహశీల్దార్ డి.సీతారామయ్య ఆదేశించారు.

## సాగర్ 22 గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

**ప్రజాశక్తి - విజయపురిసౌత్**

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంది. ఎగువ నుండి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం జలాశయం ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 1,45,074 క్యూసెక్కుల నీరు సాగర్ జలాశయానికి వస్తుండడంతో సాగర్ ప్రాజెక్టు 22 గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 1,70,346 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 586.70 అడుగులవద్ద ఉంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312 టీఎంసీలు కాగా ప్రస్తుతం 303.9495 టీఎంసీల నిల్వ ఉంది. ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,867 క్యూసెక్కులు, కుడికాల్వ ద్వారా 6006 క్యూసెక్కులు, ఎడమ కాల్వద్వారా 3667 క్యూసెక్కులు, ఎస్-ఎల్‌బిసి ద్వారా 2400 క్యూసెక్కులు, లోలెవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కులు, మొత్తంగా రిజర్వాయర్ నుండి 2,12,154 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మరోవైపు నీటి విడుదల నేపథ్యంలో సాగర్‌కు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం లాంచీల ద్వారా రూ.1,88,150 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు తెలిపారు.

## రాజధాని పనులకు ఆటంకం

(మొదటి పేజీ తరువాయి)

నీరు ఒకేసారి రావడం వల్ల ముంపు సమస్య వెంటాడుతోంది. ఇప్పటి వరకు వీటి నియంత్రణపై శాశ్వత పరిష్కారం కొనుగొనలేకపోతున్నారు.

ముంపుపై జిల్లాకు చెందిన జలవనరుల శాఖ, సిఆర్‌డిఎ అధికారుల కంటే ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు కూడా అధ్యయనం చేసి అధికారులతో ఇటీవల చర్చించారు. ముంపు నివారణలో గత పదేళ్లలో వచ్చిన విమర్శలు, ప్రభుత్వ వైఫల్యంను ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు గుర్తించారు. వాగులు అన్ని రాజధాని గ్రామాలకు బయట ప్రాంతాల్లోనే ప్రారంభం అవుతాయి. కానీ అన్ని వాగులను రాజధాని గ్రామాల మీదుగా ఇతర ప్రాంతాలకు మళ్లించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. మరో వాగుల ద్వారా వచ్చే నీటిని బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని రైతులు మొత్తుకున్నా సిఆర్‌డిఎ అధికారులు పట్టించుకోలేదు. అతి భారీ వర్షాలు, తుపాన్లు, కృష్ణానదికి వరద వచ్చిన ప్రతిసారి రాజధాని గ్రామాలకు ముంపు బెడద తప్పడం లేదు. ఈ నేపథ్యంలో వాగులు రాజధాని గ్రామాలలోకి రాకుండా బయట ప్రాంతంలోనే నియంత్రించి ప్రత్యామ్నాయ చర్యలు చేపడితే సత్ఫలితాలు వస్తాయనే సూచనలొస్తున్నాయి.

ఇటీవల వానలకు లామ్ వద్ద కొండవీటి వాగు ఉధృతి

## 30 యూనిట్ల రక్తం సేకరణ

**ప్రజాశక్తి - మేడికొండూరు**

ప్రతి ఒక్కరూ సేవా దక్పథం కలిగి ఉండాలని, రక్తదానం ప్రాణదానంతో సమానమని టిడిపి నాయకులు పాములపాటి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పేరేచర్లలోని ఐషు న్యూట్రిషన్ సెంటర్, రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 30 యూనిట్ల రక్తాన్ని సేకరించి గుంటూరు రెడ్ క్రాస్ సోసైటీకి తరలించారు. రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి రామచంద్రరాజు, ఐషు న్యూట్రిషన్ నిర్వాహకులు ఆశ, సాయి, రజిని కృష్ణ పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో జర్నలిస్టులు పండ్లు పంపిణీ

**ప్రజాశక్తి - మంగళగిరి**

ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) 69వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళగిరి శాఖ ఆధ్వర్యంలో పాత మంగళగిరిలోని సౌజన్య వృద్ధాశ్రమంలో ఆదివారం పండ్లు పంపిణీ చేశారు. జిల్లా ఉపాధ్యక్షులు టి.నాగేశ్వరరావు, నియోజకవర్గ కార్యదర్శి బి.సాంబశివరావు, నాయకులు పి.ప్రకాష్ బాబు, ఎస్.శ్రీనివాసరావు, అన్వర్ ఖాన్, జి.సురేష్, ఐ.నాగరాజు, ఎ.తేజ మణికంఠ, ఆశ్రమ వ్యవస్థాపకులు ఎన్.జోగేంద్ర చక్రవర్తి, నిర్వాహకులు శంకర్ పాల్గొన్నారు.

## 25న కలెక్టరేట్ వద్ద రజక వృత్తిదార్ల ధర్నా

**ప్రజాశక్తి - దుగ్గిరాల**

రజక వృత్తిదార్లపై దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల నివారణకు సామాజిక రక్షణ చట్టం కోసం కలెక్టరేట్ వద్ద 25న జరిగే ధర్నాలో వృత్తిదార్లు అధిక సంఖ్యలో పాల్గొనాలని రజక వత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొజ్జ సుబ్బారావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కరపత్రాలను దుగ్గిరాలలో ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తిదార్లకు ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఇంకా నెరవేర్చలేదన్నారు. రజక అభివృద్ధి -సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినా విధి విధానాలు ఖరారు చేయలేదని చెప్పారు. ఆదరణ పథకం ద్వారా రజకులకు వృత్తి పరికరాలు మంజూరు, 50 ఏళ్లకు సామాజిక పింఛను, లాండ్రీ చేసేవారికి నెలకు 250 యూనిట్లు ఉచిత కరెంటు హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఉందని విమర్శించారు. కార్యక్రమంలో పి.శ్రీనివాసరావు, డి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## వరగాని పిఎసిఎస్ చైర్మన్‌గా కడియాల గణేష్ బాధ్యతలు స్వీకరణ

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండలంలోని వరగాని ప్రాథమిక పరపతి సహకార సంఘం చైర్మన్‌గా సిరిపురానికి చెందిన కడియాల గణేష్‌బాబు ఆదివారము బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉండి వారికి సకాలంలో ఎరువులు అదేవిధంగా కృషి చేస్తానన్నారు. అనంతరం కమిటీ మెంబర్లుగా షేక్ జానీ బాషా, బొక్క విజయరత్నం ప్రమాణ స్వీకారం చేశారు. టిడిపి మండల అధ్యక్షులు ఎం.రమేష్, నాయకులు ఎస్.కృష్ణారావు, కె.హనుమంతరావు, ఎం.రాంబాబు, నీటి సంఘాల అధ్యక్షులు జె.నరసింహారావు, జనసేన గ్రామ అధ్యక్షులు జి.శంకర్, కె.శరత్ పాల్గొన్నారు.

## క్రికెట్ ఆడిన గుంటూరు ఎస్పీ

**ప్రజాశక్తి -మేడికొండూరు**

శాంతిభద్రతల పరిరక్షణ విధుల్లో నిత్యం బిజీ, బిజీగా ఉండే పోలీసులు ఆదివారం యూనిఫాం తీసేసి జెర్సీలను ధరించి మైదానంలో ఆదివారం క్రికెట్ ఆడారు. మండలంలోని పేరేచర్ల రైల్వే స్టేషన్ సమీపంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ క్రీడామైదానం ఇందుకు వేదికవగా జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ బౌలింగ్‌లో, బ్యాటింగ్‌లోనూ ప్రతిభతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## జంగంగుంట్లపాలెంలో వైసిపి ప్రచారం

**ప్రజాశక్తి - మేడికొండూరు**

మండలంలోని జంగగుంట్లపాలెం గ్రామంలో వైసిపి ఆధ్వర్యంలో ఆదివారం 'బాబు షూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. 18 ఏళ్ల నిండిన ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఇస్తానన్న పథకం, నిరుద్యోగ భృతి తదిరత హామీలు అమలు కాకపోవడంపై కరపత్రాల ద్వారా ప్రచారం చేశారు. వైసిపి మండల అధ్యక్షులు టి.వంశీకృష్ణ, సర్పంచ్ కె.శ్రీదేవి, సాంబిరెడ్డి, గ్రామ అధ్యక్షులు ఎ.ఉమామహేశ్వరరెడ్డి, నాయకులు రవికిషోర్‌రెడ్డి, అబ్బాస్, తురకపాలెం సర్పంచ్ రబ్బాని, షరీఫ్ పాల్గొన్నారు.

## వేడుకలకు వేదికగా చెత్త నుండి సంపద తయారీ కేంద్రం

**ప్రజాశక్తి - చేబ్రోలు**

చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని కొద్దిపాటి వేడుకల నిర్వహణకు వీలైన ఆహ్లాదకరమైన పార్కు మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు తెలిపారు. షెడ్డు ఆవరణలో మొక్కలు నాటి పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కేంద్రంలో వ్యర్థాల వల్ల చెడు వాసనలకు అవకాశం లేకుండా చెత్త నిర్వహణ చేస్తున్నామన్నారు. ఇక్కడ ఉచితంగా వేడుకలు చేసుకోవడానికి గ్రామస్తులకు అవకాశం ఇస్తున్నామన్నారు.

## కౌలురైతుల సమస్యలపై 25న ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

యజమానులూ సహకరించాలని కోరారు. అన్నదాత సుఖీభవను కౌల్దార్లకు ఇవ్వాలని, ఈ-క్రాప్‌లో కౌలురైతు పేరు నమోదు చేయాలని, విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు రాయితీపై కౌలురైతులకు ఇవ్వాలని కోరారు. దేవాదాయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట రుణాలు, ప్రభుత్వ రాయితీలు ఇవ్వాలన్నారు. కౌలు రైతుల పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించాలన్నారు. సాగులో నష్టపోయి, అప్పులపాలైన కౌలు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం పల్నాడు అధ్యక్షులు కె.రామారావు, నాయకులు టి.పెద్దిరాజు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యోద్యమ ఐక్యతను కొనసాగించాలి

(మొదటి పేజీ తరువాయి)

బ్రాడీపేటలోని యుటిఎఫ్ హాల్లో ఆదివారం సదస్సు నిర్వహించారు. అవాజ్ జిల్లా అధ్యక్షులు మహబూబ్ సుభాని అధ్యక్షతన జరిగిన సదస్సులో నసీర్ అహ్మద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఐక్యంగా పోరాడారని గుర్తు చేశారు. 1857 మొదటి భారత స్వతంత్ర పోరాటం, ఆ తర్వాత జరిగిన అనేక ఉద్యమాల్లో హిందు, ముస్లిములు అందరూ కలిసి పోరాడిన అనేక ఘటనలను వివరించారు. వేలూ నాచియార్ కాలంలో కుల్లీ ప్రాణత్యాగం, నానాసాహెబ్ సైన్యంలో బేగం అజీజు వీరోచిత పోరాటాలు, అశ్వఖుల్లాఖాన్, రామ్‌ప్రసాద్ బిస్మిల్లా కలిసి చేసిన పోరాటాలు, అల్లూరి సీతారామరాజుకు సహకరించిన ముస్లిమ్ అధికారులు వంటి మచ్చుకు కొన్ని ఘటనలను వివరించారు. అప్పటి మతసామరస్యానికి, సమక్యతకు ప్రతీకలుగా నిలిచిన స్వాతంత్ర్య సమరయోధులను గుర్తు చేశారు. నాటి ఐక్యతా స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లాలన్నారు. యుటిఎఫ్ నాయకులు ఎమ్‌డి షకిలా బేగం మాట్లాడుతూ 78 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో నేటి పరిస్థితుల గురించి వివరించారు. నిజమైన చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యాంగాన్ని, లౌకిక స్ఫూర్తిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మిడిల్‌క్లాస్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వివికె.సురేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని, లౌకిక తత్వాన్ని కాపాడుకోవడం కోసం ప్రజల్ని సమైక్యంగా ఉద్యమించడమే మన ముందున్న కర్తవ్యమని చెప్పారు. సదస్సులో ఆవాజ్ రాష్ట్రకార్యదర్శి ఎంఎ చిష్టి, జిల్లా కార్యదర్శి షేక్.బాషా, ఎమ్‌డి.సలీం, ప్రొఫెసర్ వేణుగోపాల్, విరసం నాయకులు రవిచంద్ర పాల్గొన్నారు.

## రేకుల షెడ్డుల్లో హాస్టళ్లు!

(మొదటి పేజీ తరువాయి)

బాలుర హాస్టల్ నిర్వహణకు ప్రభుత్వ అనుమతి లభించినా, విద్యార్థుల నుండి అధిక సంఖ్యలో ధరఖాస్తులు వచ్చినా ఇప్పటికీ ప్రారంభం కాలేదు. కాలేజీలకు అనుబంధంగా ఉన్న సంక్షేమ హాస్టళ్ల సైతం అద్దె భవనాల్లో, చిన్న చిన్న గదులు, వసతుల లేమి, సమస్యల వలయంలో కునారిల్లుతున్నాయి. నరసరావుపేట రోడ్డులోని శ్రీనివాస్ నగర్‌లోని అద్దె భవనంలో బీసీ బాలుర హాస్టల్‌ను కొనసాగుతోంది. ఇక్కడ 40 మంది ఇంటర్, ఐటిఐ విద్యార్థులుంటున్నారు. కారంపూడి రోడ్డులోని ఒక రేకుల షెడ్డులో బీసీ బాలిక హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు. సుమారు 60 మంది విద్యార్థినులు సమస్యలతో సతమతమవుతూ ఉంటున్నారు.

వెనుకబడిన ప్రాంతమైన వినుకొండ ప్రాంతంలో పేదలు అధికం. తమ పిల్లల్ని ఉన్నతంగా చదివించాలని తల్లిదండ్రులు వారిని ప్రభుత్వ హాస్టళ్లలో చేరుస్తుండగా వారు ఇక్కడ పరిస్థితుల దృష్ట్యా చదువులపై కేంద్రీకరించలేకపోతున్నారు. 15 ఏళ్లుగా హాస్టళ్ల అరకొర వసతులతో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని, వీటిల్లో సమస్యల వల్ల చాలామంది చదువులు మానుకున్నారని విద్యార్థి సంఘం నాయకులు మహంకాళి సుబ్బారావు అన్నారు. నూతన భవనాలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని, పేద విద్యార్థులు ప్రశాంతంగా చదువుకునే వాతావరణ కల్పించాలని డిమాండ్ చేశారు.

రైల్వే స్టేషన్ రోడ్డులో శిథిలావస్థలో ఉన్న హాస్టల్

# ఊపిరితిత్తుల సమస్యల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం ఊపిరితిత్తుల వ్యాధులపై ఆరోగ్య సభ నిర్వహిం చారు. ఈ సభలో పల్మనాలజిస్ట్ డాక్టర్ అనూష మోదేపల్లి ముఖ్యవక్తగా పాల్గొని మాట్లాడుతూ ఊపిరితిత్తుల విషయంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలని, దగ్గు, కఫం, ఛాతి పట్టేయటం లాంటి లక్షణాలు కనబడితే వెంటనే పల్మనాలజిస్ట్ సంప్రదించాలన్నారు. 15 రోజులకు మించి దగ్గు ఉంటే వెంటనే అది ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యగా భావించి డాక్టర్‌ను కలవాలన్నారు. సాధాం్ణంగా ట్రాఫిక్ పోలీసులకు, కర్మాగారాల్లో పనిచేసే కార్మి కులకు, జూట్‌మిల్‌లో పనిచేసే వారికి, హోటల్స్‌లో పొయ్యివద్ద పనిచేసే వంటమాస్టర్లకు, కోళ్ల పరిశ్రమలో పనిచేసే వారికి, బట్టల పరిశ్రమలో పనిచేసే వారికి, రంగుల తయారీ పరిశ్రమలో పనిచేసే వారికి ఇలా దుమ్ము, రసాయన పదార్థాలతో ముడిపడిఉన్న వాటిలో పనిచేసే వారికి, జంతువులను పెంచుకునే వారికి ఊపిరితిత్తుల సమస్య ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. కాలుష్యంతో కూడిన వాతావరణంలో, ఎక్కువ మంది జనాలలో, బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరిస్తే మంచిదన్నారు. శ్వాసకోశ నాళాలు గట్టిపడినప్పుడు ఉబ్బసం, ఆయాసం లాంటి జబ్బులు వస్తాయన్నారు. శ్వాసకోశ కండరాల సమస్య ఎదురైనపుడు నిమోనియా లాంటి సమస్య ఉత్పన్నమవుతుందని, ఈసమస్య వచ్చినప్పుడు దగ్గు, జ్వరం, కఫం లాంటి లక్షణాలు కనబడతాయన్నారు. గురక సమస్య గురించి మాట్లాడుతూ మనం పీల్చుకునే గాలిని తీసుకొనిపోయే గాలిగొట్టాలు సరిగా తెరుచుకోకపోవటం వల్ల గురక సమస్య వస్తుం దన్నారు. ఈ సమస్యకు స్లీప్‌స్టడీ అనే విధానంలో గురకకు కారణం తెలుసుకొని వైద్యం చేయవచ్చన్నారు. ఈగురక సమస్య వల్ల సరైన నిద్ర లేకపోవడం, మెదడుకు తగిన ఆక్సిజన్ అందకపోవటం వల్ల ఒక్కొక్కసారి ప్రాణాంతకం అయ్యే అవకాశం ఉందన్నారు. అధిక బరువు కూడా ఊపిరితిత్తుల సమస్యకు కారణం అవుతుందన్నారు. ఆయాసం గురించి మాట్లాడుతూ ఈ సమస్యకు మంచి మందులు ఉన్నాయని, పీల్చుకునే శక్తి ఉన్నవారికి రోటోక్యాప్స్, ఇన్హేలర్లు పీల్చుకునే శక్తి లేని వారికి స్పేసర్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. అసలు ఏమాత్రం శక్తి లేని వారికి నెబిలైజర్లు ఉంటాయన్నారు. ప్రస్తుతం పిల్లలకు చిన్న వయసులోనే వ్యాక్సిన్ వేస్తున్నారని, చిన్నతనంలో వ్యాక్సిన్ వేసుకోలేకపోయినా, 60 ఏళ్లుదాటిన వారందరూ నిమో పోకల్ వ్యాక్సిన్, ఇన్ఫ్లూయంజా వ్యాక్సిన్ సంవత్సరానికి ఒకసారి వేయించుకోవాలన్నారు. ఆరోగ్య సభకు టీవీ సాయిరాం కోఆర్డినేటర్‌గా వ్యవహరించగా, అవగాహన సభ్యులు శాంత శ్రీమన్నారాయణ, గాయత్రి బ్యాంక్ మేనేజర్ టి. సుబ్బారావు, కిమ్స్‌శిఖర హాస్పిటల్ పిఆర్ఓ నూరుల్ అహ్మద్, కుమార్ ప్రసంగించారు.

మాట్లాడుతున్న డాక్టర్ అనూష

మాట్లాడుతున్న కెవిపిఎస్ రాష్ట్రకార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి

## మందడం లంక భూమి లబ్ధిదారులకు తక్షణమే ప్లాట్లు కేటాయించాలి : కెవిపిఎస్

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతి పరిధిలోని మందడం లంక భూమి లబ్ధిదారులకు సి ఆర్ డి ఎ అధికారులు తక్షణమే రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించడంతో పాటు కౌలు చెల్లించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి డిమాండ్ చేశారు.లంక సొసైటీ లబ్ధిదారులైన దళితులు రాజధాని కోసం తమ సాగులో ఉన్న భూమిని సి ఆర్ డి ఎ కి ల్యాండ్ పూలింగ్ లో ఇచ్చినప్పటికీ కౌలు, రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించకుండా దళితుల పట్ల వివక్ష చూపడం దుర్మార్గమని మాల్యాద్రి అన్నారు. ఆదివారం రాత్రి మందడం లంక భూమి లబ్ధిదారుల సమావేశం జరిగింది.సమావేశంలో మాల్యాద్రి మాట్లాడుతూ 2014 వరకు భూమికి శిస్తు కట్టి దానిపై ఫలసాయం అనుభవిస్తున్న దళితులను సి ఆర్ డి ఎ అధికారులు మోసం చేస్తున్నారన్నారు. రాజధానిలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ప్రారంభం నుంచి దళితులపై వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు.సి ఆర్ డి ఎ అధికారులు ఇప్పటికైనా దళితులకు రిటర్నబుల్ ప్లాట్లు కేటాయించి న్యాయం చెయ్యాలని,లేనిపక్షం లో లబ్ధిదారులతో కలిసి కెవిపిఎస్ పోరాటం చేస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి జె నవీన్ ప్రకాష్,నాయకులు కె రమేష్,లంక సొసైటీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఒంగోలు 7వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

**I.A. No. 1386/2018**
**in**
**O.S. No. 19/2013**

Between:
ఇందేటి నాగ విష్ణు కోటేశ్ ......వాది
మరియు
ఇందేటి సీతారావమ్మ అండ్ అదర్స్ ....ప్రతివాదులు

**To:**
**6వ రెస్పాండెంట్ చిరునామా :**
ఇందేటి రామరాజు, S/o. చిన వెంకటేశ్వర్లు,
డోర్ నెం.6-14-32ఏ, ఆరండల్ పేట,
గుంటూర్ టౌన్ అండ్ డిస్ట్రిక్ట్,
ఆంధ్రప్రదేశ్.

**నోటీసు**

పై నెంబర్ దావాలో నీ హాజరు నిమిత్తము తేదీ: 29-08-2025న వాయిదా ఉన్నది. కావున ఆరోజు ఉదయం గం.10.30ని.లకు పై కోర్టు నందు స్వయముగా గాని, లాయరు ద్వారా గాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల మీ పరోక్షమున సదరు దావా తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

వాయిదా తేదీ : 29-08-2025.
ఒంగోలు
తేది 16-08-2025 ఇట్లు
జజ్జర రాజు M.A: LL.B;
వాది తరుపు న్యాయవాది,
జిల్లాకోర్ట్ ఎదురు, ఒంగోలు,
సెల్ : 9247444225

## విద్య ద్వారానే సూర్య బలిజల అభివృద్ధి సాధ్యం

**నర్సరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు**

ప్రజాశక్తి-గుంటూరు

తరతరాలుగా సామాజిక వివక్షతకు, అణచివేతకు గురైన సూర్యబలిజ సంఘీయులు స్వాతంత్ర అనంతరం కూడా ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అనేక వివక్షతలకు గురవుతున్నారని నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు అన్నారు. సూర్యబలిజలు విద్య అనే ఆయుధంతో అన్ని విధాల ఎదిగేందుకు కషి చేయాలని తెలిపారు. సూర్యబలిజ విద్యా సంఘం ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేటలోని పిఎల్.రావు భవన్‌లో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటుపుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు అందజేశారు. విద్యాసంఘం అధ్యక్షులు చదలవాడ రఘురాం సభకు అధ్యక్షత వహించగా ప్రముఖ విద్యావేత్త డాక్టర్ దాసరి కృష్ణారావు మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా పేద విద్యార్థులను గుర్తించి వారి విద్యాభివృద్ధికి చేయూతనందిస్తున్న సూర్యబలిజ సేవాసంఘం సేవలు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమ ంలో విద్యాసంఘం కార్యదర్శి మద్దెల కైలాసనాద్ బాబు, కోశాధికారి సిద్ధాబత్తుని విజయకుమార్, అల్లు భాస్కరరావు, మద్దుల రాము, చిత్తజల్లు నాగరాము, ఎం.వీరభద్రరావు, జె. వెంకట రమణమూర్తి, టి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## అవోప ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక అరండల్‌పేటలోని అవోప కార్యాలయంలో ఆదివారం అవోపా అధ్యక్షులు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన 108 మంది పేదలకు పెన్షన్లు, నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ పోలిశెట్టి శ్రీనివాస్, అవోప రాష్ట్రఅధ్యక్షులు తటవర్తి రాంబాబు పాల్గొన్నారు. పొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ అవోపా ఆధ్వర్యంలో ప్రతినెల 108 మంది పేదలకు రూ.500ల చొప్పున పెన్షన్ ఇవ్వటం, వెయ్యి రూపాయలు విలువచేసే నిత్యావసర వస్తువులు, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. అవోప ద్వారా నిర్వహించే కార్యక్రమాలకు తనవంతు సహకారాన్ని అందిస్తానని, వద్ధులకు ఆరోగ్యంగా ఉంటానికి పలుసూచనలు సలహాలు చేశారు. ప్రతిరోజు వ్యాయామం నడక ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ బరువు తగ్గించుకోవాలని సూచించారు. రాంబాబు మాట్లాడుతూ ఆవోపా సమాజ సేవకు ఎప్పుడు ముందు ఉంటుందని చెప్పారు. అవోపా శాఖలు విద్య, వైద్యం, ఉపాధి అంశాలలో రాష్ట్రస్థాయిలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వచ్చేనెలలో పేద విద్యార్థులకు రూ.40 లక్షలు స్కాలర్‌షిప్‌లు ఇస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ట్రెజరర్ మహంకాళి శ్రీనివాసరావు ప్రోగ్రాం కోఆర్డినేటర్ మద్ది సాయిరమేష్, ఊటుకూరు నాగేశ్వరరావు , కోటి స్వామిగుప్తా, వెంకట్రావు, మద్ది కోటిరత్నం తదితరులు పాల్గొన్నారు

## జెవిఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు మణిపురం ఫ్లైఓవర్ వద్ద నూతనంగా నిర్మించిన జెవిఎం మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆదివారం ప్రారంభం అయ్యింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, మహమ్మద్ నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, బి.రామాంజనేయులు, డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఆధునిక సౌకర్యాలు, అత్యాధునిక వైద్య పరికరాలతో, అనేక విభాగాల నిపుణులతో గుంటూరు ప్రజలకు అందుబాటులోకి తేవటం అభినందనీయం అన్నారు. తెనాలిలో గత మూడు దశాబ్దాలుగా జెవిఎం తల్లి పిల్లల ఆసుపత్రి సేవలు అందిస్తుందని చెప్పారు. ఆసుపత్రి యాజమాన్యం డాక్టరర్ కోటి నాగయ్య మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన హాస్పిటల్‌లో పీడియాట్రిక్స్ అండ్ పీడియాట్రిక్ సర్జరీ, నీయోనాటాలజీ, ఆబ్స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, పల్మనాలజీ, ఈఎన్‌టి, అనస్థీషియాలజీ, న్యూరాలజీ, డెర్మటాలజీ, వాస్కులర్ సర్జరీ విభాగాలతోపాటు, నియోనాటల్ ఐసియు, 24 గంటల ఎమర్జెన్సీ సర్వీసులు, అడ్వాన్స్‌డ్ ఐసియు, మేజర్, మైనర్ ఆపరేషన్ థియేటర్లు, లేబర్ రూమ్, ల్యాబొరేటరీ, అల్ట్రాసౌండ్, ఎక్స్-రే వంటి సేవలు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు.కార్యక్రమంలో తులసి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ తులసి రామచంద్రప్రభు, తులసి సీడ్స్ ఎండి తులసి యోగీష్‌చంద్ర, మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్ కోటినాగయ్య, డాక్టర్ జె.వి.లక్ష్మి, డాక్టర్ జె. పవన్ కుమార్, డాక్టర్ జె.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ తదితరులు

## పైర్ల ముంపునకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం

**ప్రజాశక్తి - తుళ్లూరు :** ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే పంటలు నీట మునిగాయని వైసిపి గుంటూరు జిల్లా అధ్యక్షులు,మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. కొండవీటివాగు ఉధృతి కారణంగా పెదపరిమి - నీరుకొండ గ్రామాల మధ్య నీట మునిగిన పంట పొలాలను రాంబాబు ఆదివారం పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడారు .ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే వరదలకు పంట పొలాలు నీట మునిగాయని, కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం నిర్మించిన తర్వాతే వరదలు ఎక్కువయ్యా యని రైతులు చెబుతున్నారని రాంబాబు అన్నారు. రైతులకు పంట నష్టం అంచనాలు రూపొందించి తగిన పరిహారం వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వనమా బాల వజ్రబాబు(డైమండ్ బాబు) తదితరులు పాల్గొన్నారు.

**లారీలో సాంకేతిక లోపం కారణంగా**

## 400 ధాన్యం బస్తాలు దగ్ధం

**ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్ :** ధాన్యం లారీలో సాంకేతిక సమస్య కారణంగా లారీ తగలబడింది. ఈ సంఘటన సత్తెనపల్లి మండలం గుడ్లూరు అడ్డరోడ్డు సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. క్రోసూరు మండలం దొడ్లేరు నుండి 400 దాన్యం బస్తాలతో సత్తెనపల్లి మండలం నందిగామ అడ్డరోడ్డు వద్ద ఉన్న రైస్ మిల్లుకు వెళుతుండగా మార్గమధ్యంలో ఈ ప్రమాదం జరిగింది. లారీ ఇంజన్ లో స్పార్క్ వచ్చి అకస్మాత్తుగా మంటలు ఇంజన్ కు అంటుకుని క్యాబిన్ లోకి మంటలు వ్యాపించాయి. దీంతో లారీ డ్రైవర్, క్లీనర్ కిందకు దూకారు. 100 బస్తాల ధాన్యం కాలిపోయాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి

**ప్రజాశక్తి - తెనాలి :** రోడ్డు ప్రమాదంలో వ్యాపారి మృతి చెందాడు. సేకరించిన వివరాల ప్రకారం సుల్తానాబాదులో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. రూరల్ గ్రామం అంగలకుదురులో కిరాణా షాపు నిర్వహించే పువ్వాడ సుబ్బారావు (72) రోడ్డుపై నడుచుకుంటూ అంగలకుదురు వైపు వెళ్తుండగా, గుర్తు తెలియని కారు వేగంగా ఢీకొట్టింది. అంతే వేగంగా కారు వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సుబ్బారావును తెనాలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

## ఎనిమిది మంది గంజాయి విక్రేతలు అరెస్టు

**ప్రజాశక్తి - తెనాలి :** పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి విక్రయిస్తూ సేవిస్తున్న నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. త్రీ టౌన్ సిఐ ఎస్ రమేష్ బాబు, ఎస్సై షేక్ కరిముల్లా వెల్లడించిన వివరాలు ప్రకారం మారిస్ పేట నుంచి చుండూరు వెళ్లే పరిమి డొంకలో గంజాయి సేవిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేశారు. గంజాయి విక్రయిస్తూ, సేవిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి 1700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నిందితులు తెనాలి, గుంటూరు, పొన్నూరు ప్రాంతాలకు చెందిన వారుగా తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

**ప్రజాశక్తి - రెంటచింతల :** మండలంలోని గోలి గ్రామానికి చెందిన పీట్ల రామయ్య (32) గోలి అడ్డరోడ్డులోనే ఆలయం వద్ద అనుమానస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు ఎస్సై సిహెచ్. నాగార్జున ఆదివారం తెలిపారు. శరీరం మీద ఎక్కడా గాయాలు లేనప్పటికీ మృతి చెందడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని తల్లి పీట్ల చిన్న ఎల్లమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## రెండో పెళ్లి చేసుకున్న వ్యక్తిపై కేసు

**ప్రజాశక్తి-తెనాలిరూరల్ :** భార్యకు విడాకులు ఇవ్వకుండానే మరో మహిళను వివాహం చేసుకున్న ప్రభుద్దుడిపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఆనంద్ తెలిపిన వివరాలు ప్రకారం కొలకలూరు గ్రామానికి చెందిన లింగం శెట్టి ఉమామహేశ్వరరావు 2003లో భూలక్ష్మిని వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు ఆడపిల్లలున్నారు భార్యాభర్తలకు వచ్చిన మనస్పర్ధలు కారణంగా వేరుపడ్డారు. భార్య భూలక్ష్మికి తెలియకుండా ఉమా మహేశ్వరరావు 2012లో మరో మహిళను వివాహం చేసుకున్నాడన్న ఫిర్యాదుపై మొదటి భార్య భూలక్ష్మి తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఆనంద్ తెలిపారు. రెండో వివాహం చేసుకున్న ఉమా మహేశ్వరరావుకు మరో ఇద్దరు కుమార్తెలు జన్మించారని పేర్కొన్నారు. వారి పేర్లపై నమోదైన రేషన్ కార్డు, ఆధార్ కార్డులు, కొన్ని ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ ఆధారాలతో, రెండో పెళ్లికి సహకరించిన ఏడుగురిపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆనంద్ తెలియజేసారు.

## మహిళ ఆత్మహత్య

**ప్రజాశక్తి - తాడేపల్లి :** తాడేపల్లి పట్టణంలోని నులకపేట లో మహిళ ఆదివారం ఇంట్లో పురుగుమందు తాగి ఆత్మహత్య కు పాల్పడింది. అప్పులు ఇచ్చిన వడ్డీ వ్యాపారస్తులు వేధింపులు తట్టుకోలేక కృష్ణవేణి అనే మహిళ నాలుగు పేజీల మరణ వాంగ్మూలంలో తన చావుకు పలువురు వ్యక్తులు కారణమని రాసి పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. చావు బతుకుల మధ్య ఉన్న మహిళను బంధువులు వెంటనే హాస్పటల్ కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణవేణి మృతి చెందింది. తాడేపల్లి సిఐ వీరేంద్రబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వరినాట్లు 30 శాతమే పూర్తి

- నెమ్మదిగా ఖరీఫ్ సాగు
- కుడి కాల్వ ఆయకట్టు కింద అధికంగా వరి, మొక్కజొన్న సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- మిర్చి సాగు తగ్గే అవకాశం

గురజాల పరిధిలో వేసిన వరి నాట్లు, నరసరావుపేట మండలంలో నారు పోసేందుకు పొలం సిద్ధం చేస్తున్న రైతు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఈ ఏడాది ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో వర్షాలు ఆశించిన స్థాయిలో కురవకపోయినా నాగార్జున సాగర్ జలాలతో ఖరీఫ్ సాగు ఊపందుకుంది. ప్రధాన పంటలైన వరి, పత్తి, మొక్కజొన్న, అపరాలు లక్ష్యం మేరకు సాగయ్యే అవకాశం ఉంటుందని, మిర్చి సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉంటుందని వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో బావులు, బోర్లు, చెరువులు, నీటి కుంటలు కలిగిన రైతులు ముందస్తు నార్లు పోసుకుని నాట్లు వేస్తుండగా కొందరు రైతులు నారు పెంచడం, మరికొందరు రైతులు నారు దిబ్బలు సిద్ధం చేయడం, విత్తనాలు కొనుగోలు చేసే పనిలో నిమగ్నమయ్యారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో వరి సాగవుతుందనే అంచనా మేరకు వ్యవసాయ శాఖ అధికారులు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచారు. ఇప్పటి వరకు వరి నాట్లు 60 శాతం పూర్తి కావాల్సి ఉండగా 30 శాతమే పూర్తయ్యాయి. వ్యవసాయ బావుల కింద మాత్రమే నాట్లు పూర్తి కాగా, 10 రోజుల క్రితం వరకూ పెద్దగా వర్షాలు లేకపోవడంతో వరి రైతులు దిగాలు చెందారు. తొలకరి వర్షాలకు రైతులు ముందస్తుగా పత్తి సాగుకు అనుకూలమైన పొలాల్లో పత్తి విత్తనాలు నాటారు. తర్వాత వర్షాలు ముఖం చాటేసిన నేపథ్యంలో చాలా వరకు పత్తి పంట దెబ్బతింది. జిల్లాలో 2.30 లక్షల ఎకరాలలో పత్తి సాగు చేయగా చీడపీడల బెడద లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో పత్తి పూత దశకు చేరుకుంది. డ్రోన్ ద్వారా పురుగు మందుల పిచికారి చేయాలని, పంట సాగుకు ముందే పొలాల్లో భూసార పరీక్షలు చేయించి, అవసరమైన ఎరువుల వినియోగం చేపట్టాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువుల వాడకం పై దృష్టి సారించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

**ఎరువులు, విత్తనాల కోసం ఆందోళనొద్దు**

**ఎం.జగ్గారావు, పల్నాడు జిల్లా వ్యవసాయ అధికారి.**

ఖరీఫ్ సాగుకు అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు, యూరియా ఇతర ఎరువులు మొత్తం 3,51,765 టన్నుల ఎరువులు అందుబాటులో ఉంచాం. ఎరువులు, విత్తనాలు గురించి రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. నిషేధిత విత్తనాలు, క్రిమి సంహారక పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు. ఆయా దుకాణాల లైసెన్సుల రద్దుతోపాటు కేసుతు నమోదు చేస్తాం. విత్తన, ఎరువుల దుకాణాలను తరచూ తనిఖీ చేస్తాం. విక్రయాలకు సంబంధించిన రిజిస్టర్లను, బిల్లు పుస్తకాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలి. దుకాణంలో ఏర్పాటు చేసిన బోర్డులో నిల్వలు, పరిమాణం, అమ్మకపు ధరల వివరాలు తప్పనిసరిగా ప్రదర్శించాలి.

నారు పోసేందుకు విత్తనాలు తీసుకువెళుతున్న రైతులు

రంగురాళ్ల కోసం వెతుకుతున్న వారికి కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

## రంగురాళ్ల కోసమని వేలంవెర్రిగా

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలోని త్రిపురాపురం కొండపై రంగు రాళ్లు, వజ్రాలు దొరుకుతున్నాయని వదంతులతో సుదూర ప్రాంతాల నుండి ప్రజలు తండోపతండాలుగా వచ్చి వెతుకుతున్నారు. స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఆహార వెంట తెచ్చుకొని అక్కడే ఉంటూ రంగురాళ్ల కోసం రోజుల తరబడి వెతుకుతున్నారు. కొద్ది కాలం క్రితం రెవెన్యూ, పోలీసు శాఖలు బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్ వద్ద రంగురాళ్ల కోసం కొండపై వెతికితే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బ్యానర్లు కూడా ఏర్పాటు చేశారు. అయినా ఇవేమీ పట్టించుకోకుండానే రోజురోజుకూ అధికంగా వస్తున్న వారి సంఖ్య పెరుగుతుండడంతో పోలీసులు ఆదివారం రంగురాళ్లు వెతుకుతున్న వారందరినీ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. గతంలో సత్తెనపల్లి మండలంలోనూ ఇలాంటి వదంతులతోనే పలువురు వెదుకులాడి నిరాశకు గురయ్యారు.

## 'మున్సిపల్ డిఇ కాంట్రాక్టర్ అవతారం'

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పట్టణంలో పారిశుధ్యం లోపించిందని, కుళ్లిన వ్యర్థాలు, ఖాళీ సీసాలతో దుర్వాసన వెదజల్లుతూ జనం ఇబ్బంది పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. గుడ్ మార్నింగ్ నరసరావుపేట కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆయన స్థానిక కుమ్మరి బజార్, రైల్వే స్టేషన్ ఫస్ట్ గేట్ సెంటర్, షాలెంనగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే స్టేషన్ ఫస్ట్ గేటు వద్ద ఉన్న ఎస్టీ బాలికల కళాశాల హాస్టల్ ఎదురు పెద్ద చెత్త కుప్పలు ఉన్నాయని, వాటి ఎదురు బీరు, మద్యం సీసాలు పడేసి ఉన్నాయని చెప్పారు. మందు బాబులతో ఇబ్బందిగా ఉందని స్థాని మహిళలు వాపోతున్నట్లు చెప్పారు. రాత్రిళ్లు బహిరంగ ప్రదేశాల్లోనే మద్యం తాగుతున్నారని అన్నారు. వర్షా కాలం నేపథ్యంలో పారిశుధ్యం లోపిస్తే రోగాలు వస్తాయని హెచ్చరించారు. మున్సిపల్ డిఈ కాంట్రాక్టర్ అవతారమెత్తడంతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదని, ఎవరైనా టెండర్ వేస్తే ఆయన కింద సబ్ లీజు తీసుకుని పనులు చేయాలి తప్ప సొంతంగా చేయనీయడం లేదని ఆరోపించారు. వీటన్నింటి కారణంగా పారిశుధ్యం అధ్వానంగా తయారైందని, ఈ పరిస్థితిని చక్కదిద్దాలని డిమాండ్ చేశారు.

## పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా : పాఠశాల అభివద్ధికి పూర్వ విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకు రావడం గొప్ప విషయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేటలోని రామకృష్ణ ఓరియంటల్ గవర్నమెంట్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.12 లక్షలతో ప్రహరీ నిర్మాణం, క్రీడా ప్రాంగణం అభివృద్ధికి ముందుకొచ్చారు. పనులకు ఎమ్మెల్యే అరవింద బాబు ఆదివారం శంకుస్థాపన చేశారు. నియోజకవర్గంలో సౌకర్యాల లేమితో ఉన్న ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

## వరికపూడిసెల పూర్తి చేయకుంటే రాజకీయ జీవితం వ్యర్థం

### ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి - మాచర్ల

దశాబ్దాల కల వరికపూడిసెల పూర్తి చేయకుంటే నా పదేళ్ల రాజకీయ జీవితం వ్యర్థమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ విజయోత్సవ ర్యాలీలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి హాజరై ట్రాక్టర్ నడిపారు. మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సభలో ఎంపీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అభివృద్ధి, శాంతి నెలకొనాలంటే వరికిపూడిసెల పూర్తికావాలని, ఇదే విషయం సిఎం దృష్టికి తీసుకెళ్లానని, ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తేనే ప్రజాప్రతినిధులుగానూ తమకు గౌరవమని అన్నారు. ప్రాజెక్టు నిర్మాణ ప్రదేశాన్ని అధికారులు ఇటీవల పరిశీలించారని, త్వరలోనే పనులు చేపడతామని అన్నారు. ఈ ప్రాంతంలో 1000 అడుగులు బోర్లు వేసినా నీరు రాదని, ఒక వేళ వచ్చినా 6 నెలలు వస్తే 6 నెలల రావని చెప్పారు. ఈ ప్రాంత నీటి సమస్యలను పరిష్కరించాటానికి రూ.2వేలు కోట్లతో పథకానికి శ్రీకారం చుట్టామని, మరో రెండేళ్లలో మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని ప్రతి గ్రామం, ప్రతి ఇంటికి తాగునీరు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు. పంటలను జిల్లా మార్కెట్ యార్డుకు తరలించేందుకు అనువుగా నియోజకవర్గంలో అనేక రహదారులను కలుపుతూ, రాష్ట్ర, జాతీయ రహదారుల నిర్మాణాలకు రూ.2, 500 కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో నాయకులు ధారూనాయక్, మున్సిపల్ ఛైర్మన్ షేక్ మదార్ సాహెబ్, మార్కెట్‌యార్డు ఛైర్మన్ రాజబోయిన మధుయాదవ్, టిడిపి పట్టణ పట్టణ అధ్యక్షులు కొమెరా దుర్గారావు, మద్దిగపు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

## ఉమ్మడి గుంటూరు జిల్లా అమోచ్యూర్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-సత్తెనపల్లి : ఉమ్మడి గుంటూరు జిల్లా అమోచ్యూర్ సాఫ్ట్ బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం దూళిపాళ్ల లయోలా ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జరిగింది. జిల్లా క్రీడా సాధికారత సంస్థ నుండి జిల్లా ముఖ్య శిక్షణ అధికారి పి.నరసింహారెడ్డి పర్యవేక్షించారు. క్రీడా కోడ్-2011 అనుసరించి ఎన్నికలు నిర్వహణకు నిర్ణయించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా దూళిపాళ్ల లయోలా ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ఇ.వంశీకృష్ణారెడ్డి, పి.సామంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సంతోష్ ప్రభుకుమార్, సహాయ కార్యదర్శిగా నర్రా శ్రీనివాస్, కోశాధికారిగా ఎ.జగన్నాథ్ యాదవ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వి.శబరినాథ్, పి.శివపార్వతి, డి.యామిని, వై.రంజాన్‌బి ఎన్నికయ్యారు. ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా అడ్వకేట్ ఎస్వీ రమణారెడ్డి వ్యవహరించగా జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులుగా జి.కృష్ణకిషోర్‌రెడ్డి, పి.శివపార్వతి, రాష్ట్ర సాఫ్ట్ బాల్ అసోసియేషన్ తరపున రాష్ట్ర కన్వీనర్ ఎం.వి.రమణ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ బి.లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

# ఏళ్లతరబడి అధ్వానంగా డొంకరోడ్డు

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండల కేంద్రమైన ముప్పాళ్లలో పొలాలకు వెళ్లే సర్కార్ డొంక రోడ్డు గుంతలతో అధ్వానంగా తయారైంది. పొలాలకు వెళ్లాలంటే రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలప్పుడైతే వెళ్లలేని పరిస్థితి నెలకొంది. సుమారు 3 కిలోమీటర్లుండే ఈ డొంక రోడ్డు నుంచే పొలాలకు ఎరువులు తొలకం, బండ్లు, అరకలు, ట్రాక్టర్‌లు వెళుతుంటాయి. అయితే ప్రస్తుతం పనులకు కూలీలు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నివాసాలు కూడా ఈ మార్గంలో పెరుగుతుండడంతో రాకపోకలకు సమస్యగా ఉంది. 2014 టిడిపి ప్రభుత్వ హయాంలో ఒకసారి డొంకకు గ్రావెల్ తోలి మరమ్మతులు చేశాసినా ఆ తర్వాత పట్టించుకోలేదు. దారి పూర్తిగా దెబ్బతినడంతోపాటు రైతులే చందాలేసుకుని బాగు చేయించుకుంటున్నారు. అయితే ఇలా ఎంతకాలం చేయించుకోగలమని, ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

పదేపదే రోడ్డు దెబ్బతినకుండా సిసి రోడ్డు లేదా తార రోడ్డు వేయాలని అంటున్నారు.

డొంక రోడ్డు పూర్తిగా దెబ్బతినింది. వర్షం పడితే 10 రోజుల వరకు పొలాలకు వెళ్లలేకపోతున్నాం. రోడ్డు సుమారు ఒక అరకిలోమీటరు వరకు సిసి రోడ్డు నిర్మించి ఉంది. మిగతా డొంక రోడ్డు కూడా సిసి రోడ్డు లేదా బిటి రోడ్డు వేస్తే బాగుంటుంది.

**బెల్లంకొండ ఉమామహేశ్వరరావు, రైతు.**

డొంక రోడ్డు వేయించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు విన్నవించాం. సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన పంచాయతీ రాజ్ అధికారులకు సిఫార్సు చేశారు. సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుంది.

**నాము శివ, టిడిపి నాయకులు.**

డొంక రోడ్డును బాగుచేసేందుకు సుమారు రూ.18 లక్షలవుతుందని అంచనాలు రూపొందించాం. అక్టోబర్‌లో ఉపాధి హామీ కింద నిధులు వచ్చే అవకాశం ఉంది. అప్పుడు పనులు చేయిస్తాం.

**నాగేశ్వరరావు, ఎఇ, పంచాయతీ రాజ్ శాఖ,**

# విద్యుత్ భారాలను నిరసిస్తూ 28న ప్రతిజ్ఞ

మాట్లాడుతున్న దయా రమాదేవి

**ప్రజాశక్తి-గుంటూరు**

స్మార్ట్ మీటర్లు, విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా ఆగస్టు 28న జరిగే ప్రతిజ్ఞ కార్యక్రమాలను జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక పాతగుంటూరులోని సిఐటియు కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించిన యూనియన్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో రమాదేవి మాట్లాడుతూ 2000 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు వ్యతిరేకంగా పెద్దఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన పోరాటంలో యువకిశోరాలు రామకష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలస్వామి ప్రాణాలు కోల్పోయారన్నారు. నాటి పోరాట ఫలితంగా 20 ఏళ్లపాటు విద్యుత్ ఛార్జీలు పెంచడానికి పాలకులు భయపడ్డారన్నారు.నేడు సర్‌ఛార్జీలు, ట్రూ అప్‌ఛార్జీల పేరుతో అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నారని, స్మార్ట్ మీటర్ల ద్వారా మరింత దోచుకోవటానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను పగలగొట్టమని చెప్పిన నాయకులు ఇప్పుడు ఎందుకు వాటినే అమలు చేస్తున్నారో ప్రజలకు చెప్పాలన్నారు. 2000 సంవత్సరం వాటి విద్యుత్ పోరాటంలో అమరుల గుర్తుగా ఆగస్టు 28వ తేదీని ప్రతిజ్ఞ దినంగా పాటించాలని అన్ని కార్మిక, ప్రజాసంఘాల పిలుపులో భాగంగా నిర్వహించే కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో భాగస్వాములు కావాలని కోరారు. సిఐటియు జిల్లాప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత ప్రజలపై భారాలు మోపుతుందని, వాటిని పోరాటాల ద్వారానే తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాటాల ఫలితంగా గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించబోమని ప్రభుత్వం చెప్పినా ప్రమాదం పొంచి ఉందన్నారు. కావున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.సాంబశివరావు, జిల్లా కార్యదర్శిలు వై.నేతాజీ, జి.రమణ, బి.ముత్యాలరావు, నన్నపనేని శివాజీ, సిహెచ్ నాగబ్రహ్మాచారి, ఎస్ఎస్ చెంగయ్య, యం.భాగ్యరాజు, లక్ష్మీ, జిల్లా ఉపాధ్యక్షులు కే శ్రీనివాసరావు, వి దుర్గారావు, ఎస్కే హుస్సేన్ వలి, కె.బాబుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 1.5 కి.మీ కృష్ణ రివర్ క్రాస్ స్విమ్మింగ్ పోటీలు

**ప్రజాశ క్తి - తాడేపల్లి**

అమరావతి కరకట్ట పై గల ఆక్వా డెవిల్స్ అసోసియేషన్ ప్రాంగణంలో ఆదివారం ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్వీన్ విక్టోరియా, ఆమె కుమారుడు స్టీఫెన్ కుమార్1.5 కి మీ కృష్ణా రివర్ క్రాస్ సిమ్మింగ్ కాంపిటీషన్‌లో పాల్గొనటం తమకు ఆనందంగా ఉందని అసోసియేషన్ అధ్యక్షులు లింగిపిల్లి రామకృష్ణ చెప్పారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2023 సంవత్సరం సెర్బియా దేశంలోని బిల్ గ్రేడ్లో వరల్డ్ ఓపెన్ వాటర్ ఫిన్ స్విమ్మింగ్ పోటీలలో 3.0 కేఎం స్విమ్మింగ్ పోటీలో బంగారు పతకం సాధించినట్టు వెల్లడించారు. 2024 సంవత్సరంలో జూన్ నెలలో ఇంగ్లీష్ ఛానల్ రిలే పోటీలలో మన తెలుగు రాష్ట్రాల తరఫున పాల్గొన్న మొట్టమొదటి మహిళగా రికార్డు సాధించారని, 2025 జూన్ లో తల్లి కొడుకులు జాతీయ రికార్డు నెలకొల్పారన్నారు. 2025 సంవత్సరం మార్చి 4వ తేదీన సే నోటు డ్రగ్స్, సేవ్ అవర్ ఇండియన్ ఓషన్ వాటర్ అనే నినాదంతో గోవాలోని కండోలియం బీచ్ నుండి వాగటూర్ బీచ్ వరకు 11 కి మీ చేసిన స్విమ్మింగ్ లో ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించినట్టు తెలిపారు. అమెరికాలోని మెయిన్ ల్యాండ్ నుండి సౌత్ కాలిఫోర్నియా బీచ్ వరకు 33.5 కి మీ స్విమింగ్ చేయుటకు సెప్టెంబర్ నెలలో వెళుతున్న వారికి ఆక్వాడెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ తరఫున అభినందనలు తెలిపారు. అసోసియేషన్ లైఫ్ చైర్మన్ గోకరాజు గంగరాజు సూచన మేరకు వారికి రూ.25,116 ప్రోత్సాహ చెక్కును అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి వై.వి.రమేష్ కుమార్ మాట్లాడుతూ శ్రీమతి క్వీన్ విక్టోరియా తన పిల్లలను ఈత శిక్షణ శిబిరంలో చేర్పించి తాను కూడా పిల్లలతో పాటు ఈత నేర్చుకొని మాస్టర్స్ స్విమ్మింగ్ లో పాల్గొను టం తమకు ఆనందంగా ఉందని తెలిపారు. ఆక్వా డెవిల్స్ ప్రాంగణంలో ఉన్న కృష్ణా నదిలో ఓపెన్ వాటర్ లో ప్రాక్టీస్ చేసి ఈరోజు ప్రపంచంలోని సముద్రాలను ఈదుతున్న మొట్టమొదటి తెలుగు మహిళ మరియు ఆమె కుమారుడు మా ఆక్వా డెవిల్స్ గౌరవ సభ్యులు కావటం మాకు గర్వకారణం అని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు గోపాలం సాంబశివరావు, సహాయ కార్యదర్శి ఏ.రామిరెడ్డి, కోశాధికారి కె.వి రామయ్య, కార్యవర్గ సభ్యులు కే సాంబశివరాజు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, కర్రీ సాంబయ్య, పి.శ్రీనివాసులు , కే.ఆశీర్వాదం , అబ్దుల్ గఫూర్ తదితరులు తల్లి, కొడుకును సన్మానించారు.

# క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్)ను సోమవారం మండల, డివిజనల్ మరియు మున్సిపల్ స్థాయిలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ ద్వారా పంపవచ్చునని తెలిపారు. అలాగే వారి యొక్క అర్జీల నమోదు నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి ఇన్ఫర్మేషన్ ఏమన్నా తెలుసుకోవాలంటే 1100 (డబల్ వన్ డబల్ జీరో) కి నేరుగా కాల్ చేయవచ్చని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి తమ ఫిర్యాదులను సమీ పంలోని మండల కార్యాలయాలు, డివిజనల్ కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాలలో సమర్పించుకోవచ్చునన్నారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

# జూనియర్ ఎన్‌టిఆర్ అభిమానుల నిరసన

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అనంతపురం ఎమ్మెల్యే తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆదివారం సాయంత్రం గుంటూరులోని జూట్ మిల్లు వద్ద పలువురు టిడిపి కార్యకర్తలు ఎన్టీఆర్ అభిమానులు డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ కటౌట్ కీ పాలాభిషేకం చేశారు. ఎన్‌టిఆర్ అభిమాన సంఘం నాయకులు తిరువీధి హరికృష్ణ మాట్లాడుతూ అనంతపురం ఎమ్మెల్యే తీరు సరికాదన్నారు. అనంతపురంలో ఉన్న ప్రజా సమస్యలను గాలికి వదిలేసిన ఇతర అంశాలపై మాట్లాడటం తగదన్నారు. జూనియర్ ఎన్టీఆర్ గురించి మాట్లాడే స్థాయి మీకు లేదన్నారు. ఓట్ల కోసం ఎలక్షన్లో టిక్కెట్ కోసం ఎన్టీఆర్ అభిమానుల మద్ధతు కోరి ఇప్పుడు గెలిచిన తరువాత ఇష్టానుసారంగా మాట్లాడితే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# ఎన్‌ఆర్‌టి ఐకాన్ టవర్ నిర్మాణ ప్రదేశంలో వర్షపు నీరు

ఎన్ ఆర్ టి ఐకాన్ టవర్ నిర్మాణ ప్రదేశంలో నిలిచిన నీరు

నిర్మాణానికి వినియోగించే భారీ యంత్రాలు

**ప్రజాశక్తి - తుళ్లూరు**

రాజధాని అమరావతిలో ఎన్‌ఆర్‌టిఎస్ (ఎపి నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ) ఐకాన్ టవర్ నిర్మాణ ప్రదేశంలోకి కొద్దిపాటి వర్షం నీరు చేరింది. రాయపూడి సమీపంలో 5 ఎకరాలలో సుమారు రూ 500 కోట్ల వ్యయంతో 36 అంతస్తులతో నిర్మించే ఎన్ ఆర్ టి ఐకాన్ టవర్ నిర్మాణానికి 2018 జూన్ 22న ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత టిడిపి అధికారం కోల్పోయి వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉండగా ఐకాన్ టవర్ నిర్మాణం ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్ ఆర్ టి టవర్ నిర్మాణానికి టెండర్ ల ప్రక్రియ పూర్తవడంతో పనులు మొదలయ్యాయి. ఇటీవల కురిసిన భారీ వర్షానికి నిర్మాణ ప్రదేశంలోకి కొద్దిపాటి నీరు చేరింది. భారీ యంత్రాలతో నిర్మాణ పనులు జరగాల్సి ఉండడంతో నీరు అడ్డంకిగా మారింది. దీంతో నిర్మాణంలో వినియోగించాల్సిన మెటీరియల్‌ను సిద్ధం చేసే పనిలో కార్మికులు నిమగ్నమయ్యారు. పొడియంతో కలిపి 36 అంతస్తుల ఐకాన్ భవనాన్ని 3 దశల్లో నిర్మిస్తారు. మొదటి దశలో నిర్మించే ఫౌండేషన్‌కు టెండర్ ప్రక్రియ ముగిసింది. మొదటి దశ నిర్మాణం కొలిక్కి వస్తున్న తరుణంలో మిగిలిన నిర్మాణాలకు కూడా టెండర్లు పిలిచే అవకాశం ఉందని అంటున్నారు. ప్రవాసాంధ్రుల నిధులతోనే ఐకాన్ జంట టవర్లుగా నిర్మాణం జరగనుంది. రెండు టవర్లలోను ఒక్కో దానిలో 29 అంతస్తులు ఉంటాయి. మొదటి టవర్‌లోని 29 అంతస్తుల్లో ఒక్క అంతస్తుకు రెండు చొప్పున రెసిడెన్షియల్ ప్లాట్లు ఉంటాయి. రెండో టవర్లో కార్యాలయాలు ఉంటాయి. ఇందులో నివాస ప్లాట్లను వారికే కేటాయిస్తారు. కార్యాలయంలో ఏర్పాటయ్యే కంపెనీలతో వేలాదిమందికి ఉపాధి లభించే అవకాశం ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. 2018 నాటికి టవర్ల నిర్మాణం పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది.

## రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి కృషి : ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో పలు ప్రాంతాల రజక ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడారు. రజకుల రాజకీయ, ఆర్థిక అభ్యున్నతికి చిత్తశుద్ధితో టిడిపి కృషి చేసిందని గుర్తు చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపారని, రజకుల సమస్యలపై అధ్యయన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రజకుల సంక్షేమం కోసం కోట్లాది రూపాయలు కేటాయించి, అవసరమైన చోట్ల ధోబీ ఘాట్‌ల నిర్మాణం చేపట్టినట్టు వివరించారు. ఉచిత విద్యుత్, ఆదరణ పథకం ద్వారా పనిముట్లు అందించడం, ప్రత్యేక బడ్జెట్ నిధులు కేటాయించడం, చట్ట సభల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పించడం వంటి అనేక నిర్ణయాలు తీసుకుందన్నారు. రజకుల్లో యువ నాయకత్వాన్ని ప్రోత్సహించే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రజక నాయకులు మాట్లాడుతూ రజకులకు మరింత రాజకీయ అవకాశాలు కల్పించాలన్నారు.

రైతులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు భావన్నారాయణ, సాంబిరెడ్డి

# దేవరపల్లి అగ్రహారపు భూములను సందర్శించిన సిపిఎం నాయకులు

**ప్రజాశక్తి-తెనాలిరూరల్**

మురుగునీటి కాల్వల పునరుద్ధరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం కొలకలూరు రైల్వే ట్రాక్ ఆనుకొని ఉన్న దేవరపల్లి అగ్రహారం పంట పొలాలను గుడివాడ రైతులతో కలిసి ఆయన సందర్శించారు. దక్షిణ మధ్య రైల్వే చేపట్టిన మూడవ రైల్వే లైన్ నిర్మాణం కారణంగా మురుగు కాల్వల తూములు ఊడిపోయినట్లు రైతులు టి శివరాం, ఎన్ సుబ్రహ్మణ్యం, కె శివరామ బ్రహ్మం నాయకులకు తమ గోడు వినిపించారు. ఈ కారణంగా 125 ఎకరాల అగ్రహారపు పంట పొలాలు మురుగు నీటి సమస్యతో ఇబ్బందులకు గురౌతున్నట్లు చెప్పారు. ఖరీఫ్ సీజన్లో రెండు పర్యాయాలు ఇప్పటికే వెద పెట్టడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు దక్షిణ మధ్య రైల్వే అధికారులతో సంప్రదించి ఎరుకలపూడి వద్ద నక్కల గేటు వరకు ఉన్న కాల్వను పునరుద్ధరించి తూములను ఏర్పాటు చేయాలని కోరారు. భావన్నారాయణ మాట్లాడుతూ రైతుల సమస్యలపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని, వర్షపునీరు నిలిచి నష్టపోయిన పంటపొలాలకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. దేవరపల్లి అగ్రహారం పంటపొలాల్లో మురుగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ స్థానికంగా నెలకొన్న దోమల సమస్యపై సోమవారం నిర్వహించనున్న పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఎన్ హనుమంతరావు, శివయ్య, జి జకరయ్య, కె వెంకటేశ్వరరావు, జి రత్తయ్య, కె గగరీన్ తదితరులు పాల్గున్నారు.

# సూర్యనారాయణ స్ఫూర్తితో స్మార్ట్ మీటర్ల పై ఉద్యమించాలి : సిపిఎం

**ప్రజాశక్తి - మంగళగిరి రూరల్**

సిపిఎం నాయకులు ఆర్ధల సూర్యనారాయణను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలకు భారంగా, కార్పొరేట్లకు వరంగా ఉన్న విద్యుత్ స్మార్ట్ మీటర్ల పై ఉద్యమించాలని సిపిఎం మంగళగిరి మండల కార్యదర్శి ఉద్దంటి దుర్గారావు పిలుపునిచ్చారు. సిపిఎం నాయకులు ఆర్దల సూర్యనారాయణ 9వ వర్ధంతి సభ మండలంలోని కాజా గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. సభకు రైతు సంఘం నాయకులు తమ్మా ప్రసాదరెడ్డి అధ్యక్షత వహించారు. సూర్యనారాయణ చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఉద్దంటి దుర్గారావు మాట్లాడుతూ గ్రామంలో సిపిఎం నిర్మాణానికి... గ్రామంలో అభివృద్ధి పనులకు, సంక్షేమానికి సూర్యనారాయణ చేసిన సేవలను కొనియాడారు. అదేవిధంగా సామాజిక వర్గాల సమానత్వానికి పాటుపడ్డారని చెప్పారు. కేంద్రంలోని బిజెపి విధానాలు బడ్జెట్ ప్రతిపాదనలు చూస్తుంటే కార్పొరేట్ రంగాన్నికి లాభాలు తెచ్చిపెట్టి విధంగా ఉన్నాయన్నారు. పేదల రైతుల నడ్డి విరిచే విధంగా విధానాలు ఉండడం సిగ్గుచేటు అన్నారు. సూర్యనారాయణ స్ఫూర్తితో బిజెపి విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భీమిరెడ్డి కోటేశ్వరి, అప్పికట్ల ప్రకాష రావు, తమ్మ ప్రసాద్ రెడ్డి, ఆర్ధల రోశమ్మ, సాంబశివరావు, డి నరసింహారావు, సింహాద్రి సుమ, గోపాలరెడ్డి, అప్పారావు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రమాద భరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ఫెన్సింగ్ లేకుండా అస్తవ్యస్థంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

**ప్రజాశక్తి -రొంపిచర్ల**

అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి మండలంలోని ట్రాన్స్ ఫార్మర్లు. కనీసం వాటి ఆలనాపాలనా లేక, చుట్టూ ఫెన్సింగ్ లేక ప్రమాద భరితంగా మారుతున్నాయి. విద్యుత్ సరఫరాలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్స్ మెరుగైన సేవలు అందించడం లేదు. చిన్నపాటి చిరుజల్లులు పడితే పేలిపోయి విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గిస్తున్నాయి. అంతేకాకుండా అధికారుల ఉదాసీనత, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలకు కేరాఫ్ అడ్రసుగా మారాయి. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్లకు రక్షణ కవచాలు లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయో అన్న ఆందోళనలో మండల ప్రజానీకం కొట్టుమిట్టాడుతున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్స్ చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోతున్న నేపథ్యంలో వర్షాకాలంలో తీసుకునే కనీస జాగ్రత్తలు సంబంధిత శాఖ విస్మరించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## 5 లక్షల బీమా చెక్కు అందజేత

**ప్రజాశక్తి - వినుకొండ**

చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జీవీ

ప్రమాదంలో మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త కటికల విజయ్ కుమార్ కుటుంబానికి రూ. 5 లక్షల బీమా చెక్కును ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసన సభ్యులు జీవి ఆంజనేయులు శనివారం అందజేశారు. నూజెండ్ల మండలం ఐనవోలు గ్రామానికి చెందిన కటికల విజయ్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మఅతి చెందారు. నేపథ్యంలో రాష్ట్ర పార్టీ కార్యాలయం నుండి వచ్చిన చెక్కు ను బాదిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా జీవి మాట్లాడుతూ కార్యకర్తలకు సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ బాబు అండగా నిలుస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

## అభివృద్ధి, ఆరోగ్యం రెండు కళ్లు

**ప్రజాశక్తి - మాచర్ల**

కూటమి ప్రభుత్వానికి అభివఅద్ధి, ఆరోగ్యం రెండు కళ్లులాంటివని మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం స్థానిక వ్యవసాయ మార్కెట్ నందు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం ద్వారా 43 మంది లబ్ధిదారులకు 37 లక్షల 60 వేల విలువ చేసే నగదు చెక్కులను ఆయన పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యం విషమించి అత్యవసర పరిస్థితిలో ఉన్న ప్రతి ఒక్కరిని ఆదుకోటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగదు అందజేస్తున్న నాయకులు

## ఆత్మగౌరవాన్ని నింపే పథకం.. స్త్రీ శక్తి

**ప్రజాశక్తి - బెల్లంకొండ**

స్త్రీ శక్తి ఇది కేవలం ఆర్థిక భారాన్ని తగ్గించే పథకమే కాదు, మహిళల జీవితాల్లో ఆత్మగౌరవాన్ని నింపే పథకం అని రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి మస్తాన్ షరీఫ్ అన్నారు. మండల కేంద్రమైన బెల్లంకొండ లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.స్త్రీ శక్తి ఉచిత బస్సు పథకం ప్రారంభించడం శుభ సూచకమని రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో మహిళల వినియోగించుకుంటున్నారని తెలిపారు. పథకం తొలిరోజు ఉచిత బస్సు ప్రయాణాలతో రూ.5 కోట్ల మేర మన రాష్ట్రంలో మహిళలు ఆదా చేసుకున్నారని తెలిపారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని ఘాట్ రూట్లలో ఉచిత ప్రయాణానికి గతంలో అనుమతించని ఆర్టీసీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఘాట్ రూట్లోనూ మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని తెలిపారు.ఈ మేరకు తమ మండలంలోని మహిళలంతా సిఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ , మంత్రి నారా లోకేష్ కి, పెదకూరపాడు శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ .కూటమి ప్రభుత్వాన్ని అభినందిస్తూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంకొండ గ్రామ సర్పంచ్ సముద్రం. సయ్యద్ జానీ. రసూల్ నిడమానూరి పిచ్చయ్య కొండవీటి అబ్దుల్ రజాక్. మునగపాటి సుభాని. జవాజి పాపయ్య

## స్త్రీ శక్తితో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం : ఎమ్మెల్యే ప్రత్తిపాటి

**ప్రజాశక్తి-చిలకలూరిపేట**

ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు, నాయకులు, ప్రజల సంతృప్తి.. సంతోషం పెంచేలా పనిచేసినప్పుడే వారు చేసిన మంచి చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోతుందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తాజాగా స్త్రీ శక్తి పథకం ప్రవేశపెట్టడంతో కూటమి ప్రభుత్వం దూసుకుపోతోందన్నారు. ఆదివారం స్థానిక పండరీపురంలోని నివాసంలో నాదెండ్ల మండలంలోని పలుగ్రామాలకు చెందిన 33 మంది లబ్ధిదారులకు ప్రత్తిపాటి సీఎం.ఆర్.ఎఫ్ చెక్కులు అందజేశారు. చెక్కుల పంపిణీ కార్య క్రమంలో నాదెండ్ల మండలం అధ్య క్షులు బండారుపల్లి సత్యనారా య ణ మరియు నాదెండ్ల మండలం నాయకులు పార్టీ సీనియర్ నాయకు లు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న అధికారులు

## మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం..

**ప్రజాశక్తి - వినుకొండ**

అభివాదం చేస్తున్న నాయకులు

మైదాన ప్రాంత గిరిజనులకు అన్యాయం జరుగుతోందని, గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిథ్యం కల్పించాలని గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ అన్నారు. వినుకొండ జాషువా కళామందిర్‌లో ఆదివారం నిర్వహించిన గిరిజన ప్రజా చైతన్య యాత్ర రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించి, గిరిజన హక్కుల పరిరక్షణకై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది రిజనులకు కనీసం కూడు, గూడు, నీడ లేక పరితపిస్తున్నారని, ఇప్పటికీ రేషన్ కార్డు, ఆధార్ కార్డు లేక దుర్భరమైన జీవితాలు జీవిస్తున్నారని అన్నారు. రాష్ట్ర జనాభాలో సగ భాగంగా ఉన్న మైదాన ప్రాంత గిరిజనులకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ రంగాలలో ప్రాతినిత్యం లభించేలా పోరాడాలన్నారు. అనంతరం రౌండ్ టేబుల్ సమావేశంలో సంఘీభావం తెలిపి ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, బీఎస్పీ పార్టీ కార్యదర్శి రాజు, పల్నాడు జిల్లా యువజన నాయకుడు జరపల కృష్ణా నాయక్, యువజన అధ్యక్షుడు హనుమంతు నాయక్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు రంగ నాయక్, గౌరవ అధ్యక్షుడు విష్ణు నాయక్, ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం బాలాజీ నాయక్, డాక్టర్ కోటేశ్వరరావు నాయక్ ఒంగోలు జిల్లా అధ్యక్షుడు సైదా నాయక్, మాచర్ల జడ్పిటిసి మల్లు సామి, రేమిడిచర్ల సర్పంచ్ బ్రహ్మం, రాంజీ నాయక్, వివిధ సంఘాల నేతలు హాజరయ్యారు.

## డిఎస్‌పి హనుమంతరావుకు సన్మానం

**ప్రజాశక్తి-సత్తెనపల్లి**

ఉత్తమ సేవలు అందించిన పోలీస్ అధికారులు ప్రజల మన్ననలు పొందటమే కాక ప్రజల హృదయాల్లో స్థిర స్థాయిగా నిలుస్తారని సత్తెనపల్లి సబ్ కోర్టు మాజీ ఏపీపీ బగ్గి నరసింహారావు అన్నారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పౌర సేవలు అందించినకు సందర్భంగా ఉత్తమ పోలీస్ అధికారిగా పంత్రాన్ని అందుకొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక డిఎస్‌పి సన్మానం చేశారు.

విలియం కేరీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ

## డాక్టర్ విలియం కేరీ 256వ జయంతి వేడుకలు

**ప్రజాశక్తి-పల్నాడు జిల్లా**

స్థానిక ప్రకాష్ నగర్‌లోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆంధ బాల బాలికల వసతి గృహంలో ఆదివారం మోడరన్ మిషన్స్ ఫాదర్ గా పిలవబడే డాక్టర్ విలియం కేరీ యొక్క 256వ జన్మదిన వేడుకలను ఘనంగా జరిగాయి. డాక్టర్ విలియం కేరీ మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ముఖ్య అతిథిగా పాల్గొని డాక్టర్ విలియం కేరీ భారతదేశంలో చేసిన సేవలు, సాహిత్య, సామాజిక సంస్కరణ కృషిని కొనియాడారు. 1793లో భారతదేశానికి వచ్చిన కేరీ, సెరంపూర్‌లో బాప్టిస్ట్ మిషనరీ సొసైటీని స్థాపించి, క్రైస్తవ మత ప్రచారంతో పాటు విద్య, సాహిత్యం, మరియు సామాజిక సంస్కరణలలో అమూల్యమైన కఅషి చేశారని పేర్కొన్నారు. ఈ వేడుకలలో ఆంధ బాల బాలికల వసతి గఅహంలోని విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

**ప్రజాశక్తి -వినుకొండ**

వినుకొండ పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఉన్న సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు భారీగా తరలివచ్చారు. వేకువజాము నుంచే శ్రీ కృష్ణుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తుల కోసం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం జరిగిన ఉట్టి కొట్టే కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ వేడుకలో యువకులు, పెద్దలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమం లో ఆలయ ధర్మకర్త కనపర్తి వెంకట్రావు నిర్వహించారు. యండ్లూరి సతీష్, గాలం బ్రహ్మాజీ జడ వెంకటరావు బత్తుల రాజయ్య గాలం ప్రసన్న నర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గని భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## ఘనంగా ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాశక్తి - మాచర్ల రూరల్**

జెండాను ఆవిష్కరించి మాట్లాడుతున్న నాయకులు

ఏపీయూడబ్ల్యూజే (ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్) యూనియన్ 69వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం మాచర్ల పట్టణంలో రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని రైల్వే స్టేషన్ రోడ్ లోని సిటీ కేబుల్ కార్యాలయం వద్ద నుండి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ షేక్ మదార్ సాహెబ్, బీసీ నాయకులు బృంగా రమణారావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం పెన్షనర్స్ అసోసియేషన్ భవనములో సీనియర్ జర్నలిస్టులకు సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో ఎలక్ట్రానిక్ మీడియా తరపున సీనియర్ జర్నలిస్ట్ టీవీ9 ఖాసింను, ప్రింట్ మీడియా తరపున సీనియర్ జర్నలిస్ట్ ఎమ్మెస్ నాగేశ్వరరావులను శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి కేక్ కట్ చేయించారు. ఈ సభలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విద్యాధరణి మురళి, ఐజెయూ సభ్యులు గాడిపర్తి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి మాగులూరి రాంబాబులు మాట్లాడారు. అనంతరం శ్రీశైలం రోడ్లో ఉన్న సూర్య కిరణ్ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు.

**చిలకలూరిపేటలో..** :ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీ యూడబ్ల్యూజే) 69వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరిం చుకుని స్థానిక ప్రశాంతి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఉదయం అల్పాహారాన్ని అందించారు. ఈ వేడుకలో సీనియర్ జర్నలిస్ట్ కామ్రేడ్ పిట్టల శ్రీనివాసరావును ఏపీయూడబ్ల్యూజే నాయకులు సన్మానించారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యులు మస్తాన్ వలి, ప్రెస్ క్లబ్ అధ్య క్షుడు అశోక్, ప్రెస్ క్లబ్ కార్యదర్శి దరియావలిలు మాట్లాడారు.

## రేపు కిసాన్ మేళా

**ప్రజాశక్తి-ఈపూరు**

వ్యవసాయ శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవి ఆంజనేయులు సహకారంతో ఈనెల 19వ తేదీన వినుకొండలో కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఏవో ఆర్. రామారావు ఆదివారం తెలిపారు. ఈ మేళాలో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలు, వ్యవసాయంలో ఉపయోగించే అధునాతన పరికరాలు, యంత్రాలు ప్రదర్శిస్తారు. రైతులు-నిపుణులు అనుభవాలు పంచుకొని సమస్యలపై చర్చిస్తారని రైతులం దరూ హాజరై అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 21,22 తేదీల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం

**ప్రజాశక్తి - యడ్లపాడు**

ఈనెల 21 ,22 తేదీలలో ఉదయం 8 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలో గల శ్రీ అనంతలక్ష్మి స్పిన్నింగ్ మిల్ ఆవరణలో మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ శిబిరం సామినేని చారిటబుల్ ట్రస్ట్, కాకతీయ కమ్యూనిటీ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరగనుంది.

# "పురమిత్ర యాప్"లో సమస్యలు పరిష్కారం కావడం లేదు

## ప్రభుత్వ యాప్‌ల పట్ల పట్టణ ప్రజల పెదవి విరుపు




ప్రజాశక్తి- తాడేపల్లి

మంగళగిరి- తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కారం కావాలంటే "పురమిత్ర యాప్"లో సమస్యను డౌన్‌లోడ్ చేస్తే వెంటనే పరిష్కారం లభిస్తుందని ఆశపడిన ప్రజల ఆశలు అడియాసలుగానే మారుతున్నారు. "పురమిత్ర యాప్"లో సమస్యను డౌన్‌లోడ్ చేస్తే వెంటనే పరిష్కారం లభిస్తుంది. ఇదే కాకుండా లోకేష్ మెయిల్, హలో లోకేష్, లోకేష్ నారా యాప్‌లో సమస్యలు చెప్తే వెంటనే పరిష్కారం చేస్తామని అటు అధికారులు ఇటు మంత్రి నారా లోకేష్ కార్యాలయ సిబ్బంది పెద్ద ఎత్తున ఇటీవల ప్రచారం నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ముఖ్యంగా పైన పేర్కొన్న యాపిల్ లో పట్టణ ప్రజలు దోమలు బెడద, మురుగు సమస్య, కూరగాయల మార్కెట్ నిర్మాణం, రోడ్ల అధ్వాన పరిస్థితి, ఇళ్ళ ముందు వర్షపు నీరు నిలబడి ప్రజల రాకపోక లకు అంతరాయం కలిగించడం, నెలల తరబడి మురుగు కాలువలు తీయకపోవడం, తీసిన వ్యర్థాలను రోజుల తరబడి తొలగించక పోవడం ఇలాంటి సమస్యలను పురమిత్ర యాప్ తో పాటు పైన పేర్కొన్న యాప్ లలో ప్రజలు పరిష్కారం కోరుతున్నారు. యాప్‌లలో సమస్య చెబితే పరిష్కారం అవుతుంది అన్న ప్రజల నమ్మకాన్ని అవి ఒమ్ము చేస్తున్నాయి. ఏ సమస్య పరిష్కారానికి నోచుకోవటం లేదు. యాప్‌ల యొక్క ప్రయోజనం ప్రజలకు అందడం లేదని అసంతఅప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్య తీవ్రతను బట్టి నాలుగైదు ఫోటోలు పెట్టి ప్రభుత్వ దఅష్టికి తేద్దామనుకున్న అవకాశం ఉండటం లేదు. ఒక్క ఫొటో డౌన్‌లోడ్ చేయడానికి మాత్రమే యాప్‌లో అవకాశం ఉంది. మరిన్ని ఫోటోలు, వీడియోలు డౌన్‌లోడ్ చేయడానికి అవకాశం కల్పించాలని పుర ప్రముఖులు కోరుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయమే మిటంటే సమస్య పరిష్కారం కాకపోయినా పరిష్కారమైనట్లు వాళ్లకు వాళ్లే అందులో చూయించుకుంటున్నారు. మరో గమ్మత్తైన విషయం సమస్య పరిష్కారం కోరిన ప్రజలకు యాప్‌లో దొంగ ఫోటోలు పెట్టి సమస్య పరిష్కారం అయినట్లు చూపిస్తున్నారు. సమస్యకు సంబంధించిన ఫైల్‌ను అంతటితో మూసేస్తున్నారు. దీంతో యాప్ యొక్క ప్రయోజనం ప్రజలకు అందటం లేదు. యాప్‌ల యొక్క ప్రయోజనం ప్రజలకు చేరకపోవడంతో పారిశుధ్యం పడకేసిందనటంలో ఆశ్చర్యం లేదు. మంత్రి నారా లోకేష్ చెప్పే స్వచ్ఛ మంగళగిరి వేలవెలబోతుంది. మంత్రి కూడా కొంతమంది అధికారులు చెడ్డపేరు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారా అనే అనుమానం కలుగుతుంది. యాప్ లో పరిష్కారం కాని సమస్య పరిష్కారమైనట్లు ఎందుకు చెబుతున్నారు అనేది అంతుచిక్కని ప్రశ్నగా పట్టణ ప్రజలను తొలిచి వేస్తుంది. యాప్‌లో సమస్యను అధికారులు దృష్టికి తీసుకు వస్తే, విషయం తెలియజేసినందుకు ధన్యవాదాలు, మీ సమస్య త్వరలో పరిష్కారం అవుతుంది, మిమ్మల్ని త్వరలో సంప్రదిస్తాం అని మెసేజ్ వస్తుంది. ఇవన్నీ చూసి చదువుకోవటానికి బాగానే ఉన్నా, సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు దృష్టి సారించి "పుర యాప్", మంత్రి నారా లోకేష్ పేరుతో ఉన్న యాప్‌లలో పట్టణ ప్రజలు సమస్యను అప్‌లోడ్ చేస్తే, అది పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. లేకపోతే మంత్రికి కూడా చెడ్డ పేరు వచ్చే అవకాశం ఉంది.

### బీటెక్ విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

ల్యాప్ టాప్ అందజేస్తున్న సాదిక్

చినరావూరు ప్రాంతానికి చెందిన బిటెక్ విద్యార్థిని హాసినికి యంగ్ జనరేషన్ జనరేషన్ టీం ఉచితంగా ల్యాప్ టాప్ ఆదివారం అందజేసింది. యంగ్ జనరేషన్ టీం ఫౌండర్ అండ్ ఛైర్మన్ షేక్ సాదిక్ మాట్లాడుతూ తన తండ్రి చంద్రకాంత్‌కు ఇచ్చిన మాటప్రకారం ల్యాప్‌టాప్ అందజేసినట్లు తెలిపారు. ఆపదలో ఉన్న వారికి అపన్నహస్తాలు అందించడమే యంగ్ జనరేషన్ టీం ప్రధాన లక్ష్యమన్నారు. కార్యక్రమంలో సభ్యులు నవీన్, శివ తదితరులు పాల్గొన్నారు.

### బాధ్యతలు చేపట్టిన ఈమని సొసైటీ అధ్యక్షుడు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని ఈ మనీ సహకార వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షుడిగా కొమ్మూరి పుల్లయ్య, డైరెక్టర్‌గా గోపిశెట్టి శ్రీనివాసరావు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్థానిక దళితవాడ నుండి ఊరేగింపుగా సొసైటీకి చేరుకొని అక్కడ టిడిపి జనసేన నాయకుల సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్దెల శ్రీవాణి ఉజ్వల హరిణి మండల టిడిపి అధ్యక్షులు కేశంనేని శ్రీ అనిత దుగ్గిరాల యార్డు ఛైర్మన్ ఉన్నం ఝాన్సీ ఎంపీపీ షేక్ జబీన్, కాబోతి దేవదాసు అంచె మారుతి జనసేన మండల అధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు ఎంపీటీసీ పసుపులేటి సాయి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

### పంట పొలాలను పరిశీలించిన వైసీపీ నేతలు

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

వరద నీరు ముప్పు గురైన నీరుకొండ ప్రాంతాన్ని వైసీపీ ఇన్‌చార్జి దొంతిరెడ్డి వేమారెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజధానిలో కట్టడాలు కొండవీటి వాగు మళ్లింపు వల్ల వరద నీరు గ్రామాలను ముంచుతుందన్నారు. కొండవీటి వాగు నీరు వెనక్కి వెళ్ళటం వల్ల కాజా, చిన్న కాకాని, నంబూరు, పెద్దకాకాని గ్రామాలలోని సుమారు 70000 ఎకరాలు పంట నీట మునిగిందన్నారు. రాజధానిలో ప్రజలు ఇంకా బ్రతకాలి అంటే ఇప్పటికైనా చంద్రబాబు అవగాహనతో ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

### డ్వాక్రా సంఘాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పెదకాకాని

పురస్కారం అందుకుంటున్న రాజు(ఫైల్)

డ్వాక్రా సంఘాల అభివృద్ధికి మరింత కృషి చేస్తానని మండల డ్వాక్రా అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ బచ్చల రాజు అన్నారు. స్వాతంత్ర దినోత్సవం రోజున పాఠశాల విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి చేతుల మీదుగా ఉత్తమ సేవ పురస్కారం అందుకున్నట్లు తెలిపారు. మండలంలో డ్వాక్రా సంఘాల అభివృద్ధికి, మహిళా సాధికారతకు తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

### ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలి

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రజలు కాచి చల్లార్చిన నీటిని తాగాలని కమిషనర్ అలీం బాషా ఆదివారం తెలిపారు. మంగళగిరి-తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని ఆత్మకూరు హెడ్ వాటర్ వర్క్స్ నుండి మంగళగిరి పట్టణం (1- 32 వార్డులు), అలాగే ఆత్మకూరు, నవులూరు ప్రాంతాలకు త్రాగునీటి సరఫరా జరుగుచున్నదని, వరదల వల్ల నీరు రంగు మారిందని తెలిపారు. అలాగే ఆత్మకూరు హెడ్ వాటర్ వర్క్స్‌లో శాండ్ ఫిల్టర్ బెడ్స్ నుంచి ఫిల్టర్ మీడియా ఇటీవల మార్చినట్లు తెలియజేశారు. ఫిల్టర్ చేసిన నీటిని సరఫరా చేయడానికి ముందు హెడ్ వాటర్ వర్క్స్‌లోని ల్యాబ్‌లో క్లోరినేషన్ టెస్టింగ్ చేసి, ప్రజలకు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అయినప్పటికీ ప్రజలందరూ జాగ్రత్తగా వ్యవహరించి, త్రాగునీటిని మరిగించి చల్లార్చి మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు.

### బ్లాంకెట్ సర్వే పశుపోషణ దారులకు ఉపయోగం

ప్రజాశక్తి - పెదకాకాని

డాక్టర్ గుణధీర్

పశుపోషణ దారులు బ్లాంకెట్ సర్వేలో పాల్గొని వారి ఆర్థిక స్థితిగతులు మెరుగు పరుచు కోవచ్చునని నంబూరు గ్రామ పశు వైద్యాధికారి ఎస్.గుణధీర్ తెలిపారు. బ్లాంకెట్ సర్వేలో పశు పోషణ దారుల ఆర్థిక స్థితిగతులపై సమగ్ర సమాచారం స్వీకరించి వారి భవిష్యత్తు అవసరాలు తీర్చిదిద్దడానికి ఉపయోగప డుతుంది అన్నారు. పశు పోషణ దారులు అందరూ సర్వేలో పాల్గొని ప్రభుత్వం కల్పించే రాయితీలు పథకాలు అందిపుచ్చుకోవాలన్నారు.

# మెడికల్ షాపులపై నిఘా ఏదీ?

## ప్రభుత్వ అనుమతులు లేకుండా మందుల విక్రయాలు...

## సొంతంగా వైద్యం చేస్తూ రోగులను దోచుకుంటున్న వైనం...

ప్రజాశక్తి - మంగళగిరి

ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు నీళ్లు వదిలి మందులను క్రయ, విక్రయాలు చేస్తున్న వారిపై నిఘా లేక నిర్వాహకులు యథేచ్ఛగా రోగులను దోసుకుంటున్నారు. మంగళగిరి- తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో సుమారుగా 50 నుండి 100 మందులు షాపులు ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం ఉన్న ఈ కెమిస్ట్, డ్రగ్గిస్ట్ షాపుల నిర్వహణ ఫార్మసీ, డి ఫార్మసీ, ఫార్మా డీ ఇతర కెమిస్ట్ డ్రగ్గిస్ సంబంధించిన కోర్సులు చేసిన వారు మాత్రమే మందులు షాపులు నిర్వహించాల్సి ఉంది. మంగళగిరి పట్టణంలోని హాస్పటల్ రోడ్డులో ఫార్మసీ కోర్సులు, మెడిసిన్ కోర్సులతో, సంబంధం లేకుండా వేరే డిగ్రీలు చదువుకున్న వారు కూడా మెడికల్ షాపులు నిర్వహిస్తూ, రోగులను దోచుకుంటున్నారు. ముఖ్యంగా యాంటీబయోటిక్, స్టెరాయిడ్ మందులు ఇవ్వడం. వలన కిడ్నీ సంబంధిత వ్యాధులు, ఇంకా అనేక అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వాపోతున్నారు. మెడికల్ షాపుల వారు క్లినికల్ ఎడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కానీ అధికారులు మాత్రం అటువైపుతుంది చూడని పరిస్థితి, కానీ ఎన్ని మెడికల్ షాపుల వారికి ఇలాంటి అర్హతలు ఉన్నాయి?. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా నేరుగా మందుల షాపులు నిర్వాహకులు క్రయ విక్రయాలు చేయకూడదు అనే నిబంధన ఉన్నది. వాస్తవానికి ఈ నిబంధనకు నీళు వదిలి అమ్మ కాలు చేస్తూ ఉంటారు. వైద్య ఆరోగ్యశాఖ కెమిస్ట్రీ తగ్గిస్తూ అధికారులు సిబ్బంది కనీస తనిఖీలు చేపట్టడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పర్యవేక్షణ నిఘా లోపం కారణంగా అధిక ధరలకు మందులను విక్రయిస్తూ మందుల వినియోగ దారులను దోచుకు తింటున్నారని నగర ప్రజలు తీవ్రంగా విమర్శలు చేస్తున్నారు. ఇది ఇలా ఉండగా ఆర్‌ఎంపీలు పీఎంలు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేకుండా మందుల షాపుల నిర్వహణతో కుమ్మక్కై వైద్యం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మరికొందరూ మందుల షాపుల నిర్వాహకులు డేట్ అయిపోయిన మందులు, సిరప్‌లు అమ్ముతున్నారనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. వైద్య ఆరోగ్యశాఖ కెమిస్ట్రీస్ శాఖల అధికారులు సిబ్బంది ఎప్పటికప్పుడు తనిఖీలు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

### 257వ రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావాల్సి బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 257వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, బి.సూర్యప్రకాశరావు, బి.దానయ్య ప్రారంభించారు. దీక్షల్లో బొందలపాటి నవనీతమ్మ, బి.శివమ్మ, వి.గంగాధర్‌రావు, ఎం.డి.ఇస్మాయిల్, ఎస్.దేవరాజులు కూర్చున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. కార్యక్రమంలో తుపాకుల నాగేశ్వరావు, దుర్గాభవాని, వై.సాంబశివరావులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

### సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి- తాడేపల్లి

అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను టీడీపీ పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆదివారం అందజేశారు. తాడేపల్లిలోని 13వ వార్డులో షేక్ హుస్సేనమ్మకి, 3 వార్డులో వనమా స్వర్ణలత, 18వ వార్డులో మెగలిశ్రీను, 20వ వార్డ్‌లో నమ్మి రజనిలకు చెక్కులు అందజేసినట్లు తెలిపారు. మరికొందరికి ఎల్‌వోసీ చెక్కులను అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఇట్టా భాస్కర్, కాకుమాను కుమార్, కాటాబత్తుని నిర్మల, శివ, నాగేశ్వరరావు, షేక్ సైదా, గోలి జోజమ్మ, వనమా సుధాకర్, సియోను, కొయ్యగోర మల్లేశ్వరరావు, గిరీష్, గాడి సాంబశివరావు, పి.శ్రీనివాసరావు, షేక్ బుడే, షేక్ సైదా, వసూరి రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో యువకుడు మృతి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కొలనుకొండ రాజేష్ ( ఫైల్ ఫొటో )

ప్రాతూరు గ్రామానికి చెందిన కొలనుకొండ రాజేష్ (35) ఆదివారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందాడు. నెల రోజులుగా ఊపిరితిత్తుల వ్యాధితో రాజేష్ బాధపడు తున్నాడు. రాజేష్ విజయవాడలోని చెప్పుల కంపెనీలో చిరు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తండ్రి కొలనుకొండ దావీదు గతంలో గ్రామ సిపిఎం నాయకుడిగాను, ఇసుక క్వారీ ముఠా నాయకుడిగాను పనిచేశారు. రాజేష్ మృతి వార్త తెలుసుకున్న గ్రామానికి చెందిన సిపిఎం, టిడిపి, జనసేన, వైసిపి పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ప్రాతూరు గ్రామ శాఖ కార్యదర్శి డోకిపర్తి రాజేంద్ర బాబు, అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర కన్వీనర్ మధిర శేషయ్య, గుంటూరు జిల్లా కన్వీనర్ పుల్లగూర బిక్షాలు, దాసరి సురేష్, సుబ్బారావు, టిడిపి గ్రామ అధ్యక్షులు అరవపల్లి శ్రీనివాసరావు, తెలుగు యువత మంగళగిరి నియోజకవర్గ నాయకులు సంకురు నాని, జనసేన గ్రామ అధ్యక్షులు సంకురు విద్యాసాగర్, వైసిపి గ్రామ నాయకులు సంకురు మరియబాబు, నల్లపు రమేష్ తదితరులు ఉన్నారు.

# దొంగ ఓట్లు... దొంగ నోట్ల రాజ్యం

## దేశమంతా చర్చిస్తున్నా ఏపీలో మౌనం ఎందుకు : సిపిఐ జిల్లా మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-గుంటూరు

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరంగా ఉన్నాయని, నిజమైన స్వాతంత్ర్యసమర యోధులను అవమానించేలా మాట్లాడారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన వారిని విస్మరించి, అసలు పోరాటంలో భాగస్వాములు కాని ఆర్ఎస్ఎస్ వారి గురించి మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. సీపీఐ జిల్లా 26వ మహాసభలు గుంటూరు నగరంలో ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బీఆర్ స్టేడియం నుంచి సీపీఐ జిల్లా కార్యాలయం వరకు ప్రజాప్రదర్శన నిర్వహించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో రామకష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో దొంగ ఓట్లు, దొంగ నోట్ల పాలన నడుస్తుందని, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ దేశప్రజలకు ఆయుధంగా ఇచ్చిన ఓటు హక్కును రద్దు చేస్తున్నారన్నారు. దొంగ ఓట్ల వ్యవహారంపై దేశమంతా చర్చ జరుగుతుంటే మన రాష్ట్రంలో  చంద్రబాబు, పవన్, జగన్ దీనిపై స్పందించకపోవడం శోచనీయమని అన్నారు.బీజేపీ పాలిత రాష్ట్రాలలో కూడా విస్తృతంగా చర్చ జరుగు తుందని, కానీ చర్చలేని రాష్ట్రంగా ఏపీ నిలిచిందన్నారు. దొంగ ఓట్లపై స్పందించ ՛కుండా పులివెందులలో ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. జాతీయ ఎన్నికల కమిషన్ కూడా బీజేపీతో లాలూచీ పడిందని, సుప్రీంకోర్టు జోక్యం చేసుకుంటేగాని ఓటర్‌లిస్టు ఇచ్చే పరిస్థితి లేదన్నారు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశంలో ప్రజాస్వామ్యం నిలబడాలంటే అర్హులకు ఓటు హక్కు ఉండాలని స్పష్టం చేశారు.చంద్రబాబు, జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతికహక్కు లేదని, ఇద్దరూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యానికి పాతరవేశారని విమర్శిం చారు. ప్రతివక్షంలో ఉంటే ప్రజాస్వా మ్యం గురించి మాట్లాడతారని, అధికారం చేపట్టాక ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన సూపర్-6 హామీలన్ని ఖచ్చితంగా అమలు చేయాల్సిందేనని రామకష్ణ డిమాండ్ చేశారు. నూతన బస్సులు కొనుగోలు చేయకుండా, తగిన సిబ్బంది నియామకం జరుగకుండా మహిళలకు ఉచిత బస్సు పథకం వలన ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఆడబిడ్డ నిధి రూ.1500లు, నిరుద్యోగ భృతి రూ.3 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇవ్వాలన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అస్తవ్యస్త ఆర్థిక విధానాలతో సామాన్యులను కొల్లగొట్టి పెద్దలకు దోచిపెడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పట్ల ప్రజల్లో నిరాశ, నిస్పృహలు ఉన్నాయని, అటువంటి వారు ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిని కోరుకుంటు న్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట మాల్యాద్రి, నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్, నాయకులు వెలుగూరి రాధాకృష్ణ మూర్తి, చిన్ని తిరుపతయ్య, చెరుకుమల్లి సింగారావు, మేడా హనుమంతరావు, పుష్పాల సత్యనారాయణ, ముప్పాళ్ళ శివశంకర్రావు, రామిశెట్టి ఆదేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

నిరసన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-గుంటూరు

పెండింగ్లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంట్ రూ.6,400 కోట్లు బకాయిలు విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్.సమీర్, ఎం.కిరణ్, డిమాండ్ చేశారు. ఫీజు రియంబర్స్‌మెంట్ బకాయిలు, ఇతర సమస్యలపై ఆదివారం స్థానిక శంకర్ విలాస్ సెంటర్‌లో నిరసన కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫీజు బకాయిలు పెద్ద ఎత్తున పేరుకుపోవటం వల్ల విద్యా సంస్థల కోర్సులు ముగిసిన వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని, కొందరు వారి సొంత డబ్బులు చెల్లించారన్నారు. ఇప్పటికైనా బకాయిలు చెలించాలన్నారు. జిఒ 77 రద్దు చేసి పీజీ విద్యార్థులందరికీ ఫీజు రియంబర్స్మెంట్ అందించాలి. హాస్టల్ విద్యార్థుల మెస్ బిల్లులు రూ.3వేలకు పెంచాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలన్నారు. హాస్టళ్ల అభివద్ధికి నిధులు కేటాయించాలని, సొంత భవనాలను నిర్మించాలని, ఎయిడెడ్ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ఎయిడెడ్ విద్యాసంస్థలను నిర్వీర్యం చేస్తున్న జీవో 42, 35ను రద్దు చేయాలన్నారు. . యూనివర్సిటీలలో అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని, వీసీ పోస్టులను భర్తీ చేయాలని, అర్హులైన వారందరికీ తల్లికి వందనం ఇవ్వాలని, వెనుకబడిన ప్రాంతాలకు ఉచిత బస్సుపాసులు ఇవ్వాలని, అలాగే మండలానికి ఒక ప్రభుత్వ ఇంటర్ కాలేజి, నియోజక వర్గానికి ఒక ప్రభుత్వ డిగ్రీ కాలేజి ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జిల్లా సహాయ కార్యదర్శులు పవన్, రూపస్ నగర అధ్యక్ష, కార్యదర్శులు సౌమ్య, యశ్వంత్, నగర ఉపాధ్యక్షులు హర్షిత, గంగాధర్, సహాయ కార్యదర్శులు సంతోష్, సుభాని, శశాంక్, సూర్జిత్, గర్ల్స్ కన్వీనర్ సింధుశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## విట్ వర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - తుళ్లూరు

అపరిశుభ్రమైన, కలుషితమైన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తూ వారి ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న రాజధాని అమరావతి లోని విట్ యూనివర్సిటీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం రవి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థులు రూ 2 లక్షలు చెల్లిస్తున్నప్పటికీ వారికి కలుషిత ఆహారాన్ని పెట్టడమే కాక, అదేమని అడిగిన విద్యార్థులను బెదిరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాజధానిలో తక్కువ ధరలకి భూమిని ప్రభుత్వం వద్ద నుండి తీసుకొని, రాజధాని లోని విద్యార్థులకు ఉచితంగా సీట్లు ఇస్తామని చెప్పి మాట తప్పి రాజధాని లోని విద్యార్థుల వద్ద నుండి కూడా లక్షలాది రూపాయలు ఫీజులు పేరుతో వసూలు చేస్తు న్నారని మండిపడ్డారు. యూనివర్సిటీ యాజమాన్యం పై సమగ్ర విచారణ జరపాలని కోరారు. రాజధాని విద్యార్థులకు ఇచ్చిన హామీ మేరకు ఫీజులు వసూలు చేయడం నిలిపివేయాలని, ప్రభుత్వం జోక్యం చేసుకొని ఇప్పటివరకు రాజధాని విద్యార్థుల నుండి వసూలు చేసిన ఫీజులు మొత్తాన్ని వారికి తిరిగి ఇప్పించాలని డిమాండ్ చేశారు. మెస్ ఫీజులు కట్టి కూడా ఆహార నాణ్యత లేకపోవడం వల్ల విద్యార్థులు తినకుండా పస్తులు ఉండి క్లాసులకు వెళ్లడం ఆందోళన కలిగిస్తుందని రవి అన్నారు. మెస్‌లో క్రమం తప్పకుండా ఆరోగ్యం, భద్రత చర్యలు చేపట్టాలని, ఫుడ్ ఇన్స్పెక్టర్లతో తనిఖీలు చేయించాలని కోరారు. నాణ్యమైన ఆహారం అందించమని కోరడమే నేరంగా పరిగణిస్తూ యాజమాన్యం విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేయటం, బెదిరింపులకు దిగడం ఆపివేయాలని అన్నారు. విద్యార్థుల పట్ల యాజమాన్యం కక్షపూరితంగా వ్యవహరిస్తే వారి తల్లిదండ్రులను కలుపుకొని ఆందోళన చేపడతామని రవి హెచ్చరించారు.

మాట్లాడుతున్న పెనుగొండ లక్ష్మీనారాయణ

## పుస్తకాలపై నిషేధం నిరంకుశమైన చర్య

### రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు

ప్రజాశక్తి-గుంటూరు

ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్, రాజ్యాంగ నిపుణులు ఏ.జి.నురానీ, విద్యావేత్త సుమంత్రా బోస్ వంటి పలువురు ప్రముఖులు రాసిన 25 పుస్తకాలను నిషేధిస్తూ జమ్మూ కాశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ ఉత్తర్వులు ఇవ్వడం రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని, ఈ నిషేధాన్ని వెంటనే ఉపసంహరించాలని అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షులు పెనుకొండ లక్ష్మీనారాయణ అన్నారు. 'జమ్మూ కాశ్మీర్‌లో 25 పుస్తకాల నిషేధం' అనే అంశంపై బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఆదివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జాషువా విజ్ఞానకేంద్రం ట్రస్ట్ నిర్వహించిన ఈ కార్యక్రమానికి విజ్ఞాన కేంద్రం కార్యక్రమాల కమిటీ కన్వీనర్ ఎన్.భావన్నారాయణ అధ్యక్షత వహించారు.ముఖ్యవక్తగా హాజరైన లక్ష్మీనారాయణ ప్రసంగిస్తూ కాశ్మీర్ ప్రజల స్థితిగతులతోపాటు వారి మనోభావాలపై ఎన్నో పరిశీలనలు, పరిశోధనలు చేసిన అనంతరం అనేకమంది ప్రముఖులు అక్కడి వాస్తవ పరిస్థితులను పుస్తకాల రూపంలో తెచ్చారని, అటువంటి పుస్తకాల ప్రచురణ, కొనుగోళ్లపై గవర్నర్ వేటు వేయడం ప్రజల స్వేచ్ఛాయుత హక్కులను పూర్తిగా హరించడమేనని అన్నారు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించకుండా ఒక ప్రక్క కేంద్ర ప్రభుత్వం కాలయాపన చేస్తుంటే, మరోవైపు భారతీయ న్యాయసంహిత 152, 196, 197 సెక్షన్ల క్రింద అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్ పుస్తకాల నిషేధంవంటి చర్యలు చేపట్టడం దారుణమన్నారు. పుస్తకరచయితలు ఎవరూ కూడా ఉగ్రవాదుల అనుకూలురు కాదని ఆయన తెలిపారు. పహల్గాంలో ఇటీవల జరిగిన ఉగ్రవాదుల దాడులు, నిఘాసంస్థల వైఫల్యం వంటి పరిణామాల నేపథ్యంలో ప్రజల్లో విశ్వాసం కల్పించేందుకు తగిన దిద్దుబాటు చర్యలు అవసరమని అన్నారు. కానీ పుస్తకాలపై నిషేధం వంటి అనాలోచిత చర్యలతో రచయితల భావప్రకటనా స్వేచ్ఛపై దాడికి ఉపక్రమించడం ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనం చేయడమేనని అన్నారు.ఈ కార్యక్రమంలో హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కె.జి.శంకర్, ప్రొఫెసర్ ఎన్.వేణుగోపాలరావు, వి.వి.కే.సురేష్, నిర్బంధ వ్యతిరేక ఫోరమ్ నాయకులు కె. రవిచంద్ర, కాపు శ్రీనివాస్, అబ్దుల్ సలీం, ఎమ్.హనుమంతరావు, బి. లక్ష్మణరావు, ఎమ్.డి.షకీలాబేగం, ఎమ్.సాంబశివరావు, ఎమ్.రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల మేరకు పర్మిట్ రూమ్‌లు

### బార్ల అనుమతికి నేడు నోటిఫికేషన్ - మద్యం విక్రయాల్లో అక్రమాలను సహించం

### ప్రజాశక్తితో ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు

మద్యం విక్రయాలలో వినియోగదారులకు ఎదురవుతున్న ఇబ్బందులు, దుకాణదారులకు వస్తున్న సమస్యలను పరిగణలోకి తీసుకుని దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్టు ఎక్సైజ్, ప్రొహిబీషన్ శాఖ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాసులు తెలిపారు. మద్యం దుకాణానికి అనుబంధంగా 1000 చదరపు అడుగుల విస్తీర్ణంలో పర్మిట్ రూంలు ఏర్పాటుకు అనుమతి ఇస్తామని ఆయన వెల్లడించారు. బార్ల లైసెన్సుల మంజూరుకు సోమవారం నోటిఫికేషన్ జారీ అవుతుం దన్నారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

**పర్మిట్ రూమ్‌లకు జారీ చేసిన మార్గదర్శకాలు?**

పర్మిట్ రూం ఏర్పాటుకు ప్రభుత్వం రెండు శ్లాబ్‌లను నిర్ధేశించింది. 50 వేల జనాభా కలిగిన ప్రాంతంలో ఒక్కో దుకాణానికి ఏడాది కాలపరిమితికి రూ.5 లక్షలు, 50 వేలు జనాభా దాటిన ప్రాంతానికి ఒక్కో దుకాణానికి రూ.7.50 లక్షల ఫీజు చెల్లించాలి. 1000 అడుగుల విస్తీర్ణంలో పర్మిట్ రూం ఏర్పాటుకు అనుమతి ఇస్తాం. ఈ పర్మిట్ రూంలో తాగునీరు, స్నాక్స్ మాత్రమే సరఫరా చేయవచ్చు. మద్యం కొనుగోలు చేసిన వారు ఎక్కడబడితే అక్కడ తాగి ప్రజలకు అసౌక్యం కల్పిస్తున్నారనే ఫిర్యాదులపై స్పందించిన ప్రభుత్వం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చింది. ఇందువల్ల దుకాణం పరిధిలోనే కూర్చొని మద్యం తాగేందుకు అవకాశం కల్పించినట్టు అవుతుంది. ఇందువల్ల రోడ్లపైనా, ఖాళీ స్థలాల్లో మద్యం సేవించి ప్రజలకు ఇబ్బంది కల్గించే చర్యలు తగ్గుతాయని భావిస్తున్నాం.

**కొత్తగా బార్ల ఏర్పాటుకు ఎప్పుడు అనుమతిస్తారు?**

2025 ఆగస్టు 31తో ప్రస్తుత బార్‌ల లైసెన్సుల గడువు ముగుస్తుంది. కొత్త లైసెన్సుల మంజూరుకు సోమవారం నోటిఫికేషన్ వస్తుంది. నోటిఫికేషన్ రాగానే దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం అవుతుంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎన్ని బార్లు ఏర్పాటు చేయాలన్నదీ రాష్ట్ర ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తారు. ప్రస్తుతం గుంటూరు జిల్లాల్లో 108, పల్నాడు జిల్లాలో 53 ఉన్నాయి. మద్యం దుకాణాలకు కేటాయించిన విధంగా లాటరీ విధానంలో దరఖాస్తుదారులను ఎంపిక చేస్తారు. పారదర్శకంగా దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, లాటరీ విధానం ఉంటుంది. ఈనెలాఖారులోగా ఈ ప్రక్రియ పూర్తవుతుంది.

**దుకాణాల్లో విక్రయించే మద్యం బార్లలో విక్రయించవచ్చా?**

దుకాణాలకు సరఫరా చేసే రూ.99 బాటిల్స్‌ను బార్లకు ఇవ్వం. దుకాణాల్లో విక్రయించే వీటిని బార్లకు తీసుకువెళ్లకూడదు. ఇటీవల గుంటూరులో ఒక బార్, దుకాణంపై దాడి చేసి ఈ అక్రమాలను గుర్తించాం. లైసెన్సు సస్పెండ్ చేసి బార్ సీజ్ చేశాం. అయితే సంబంధిత బార్ యజమాని హైకోర్టును ఆశ్రయించి తన వివరణ తీసుకోలేదని ఫిర్యాదు చేశారు. బార్ యజమాని వివరణ తీసుకుని అప్పుడు చర్య తీసుకోవచ్చు. వివరణ కోరాం. త్వరలో చర్యలు మళ్లీ తీసుకుంటాం.

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి